ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 13 ఫిబ్రవరి 2024

నేడు జడ్పీ బడ్జెట్ సమావేశం



నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 12 : జిల్లా పరిషత్ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం మంగళవారం నెల్లూరులో జరగనుంది. విధులు తప్ప పెద్దగా నిధులు లేని జడ్పీ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి సభ్యులు ఆమోదించనున్నారు. ఎజెం డాలో బడ్జెట్ మినహా ఏ ఇతర అంశాలను పొందుపరచలేదు.

● ఎంపీ, ఎమ్మెల్యేలకు చివరిది..

జడ్పీ సమావేశం జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రధాన వేదికగా ఉంటోంది. ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి హాజరై తమ నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తారు. అయితే కొంతకాలంగా జడ్పీకి నిధులు, ఆదాయ వనరులు లేకపోవడంతో జడ్పీ సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యేల పదవీ కాలం మరో మూడు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుత జడ్పీ సమావేశం వారికి చివరిది కానుంది.


ముహూర్తం కుదిరింది!



- రేపే టిడ్కో ఇళ్ల పంపిణీకి రంగం సిద్ధం
- సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు ఆహ్వానాలు

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 12 : నెల్లూరులోని టిడ్కో గృహాల పంపిణీకి ఎట్టకేలకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఈ నెల 14వ తేదీన లబ్ధిదారులకు అందచేసేందుకు కార్పొరేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు ఆహ్వాన పత్రికలు అందచేసే పనిలోపడ్డారు. అల్లీపురంలోని టిడ్కో సముదాయం వద్ద 14న ఉదయం 10 గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అల్లీపురంతోపాటు వెంకటేశ్వరపురం ఫేజ్-2, అక్కచెరువుపాడు, కొండ్లపూడి, కల్లూరిపల్లి ప్రాంతాలలో 15,307 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఇందులో భాగంగా సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు కబురు పెడుతున్న కార్పొరేషన్ అధికారులు అల్లీపురం తరలిరావాలని కోరుతున్నారు. ఈ బాధ్యతలను ఇప్పటికే స్థానిక వలంటీర్లకు అప్పగించారు. సార్వత్రిక ఎన్నికల గడువు తరుముకొస్తున్న నేపథ్యంలో అరకొరగా సిద్ధం చేసిన ఇళ్లను లబ్ధిదారులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

వివరాలు అడిగితే ఇవ్వరేం!



మున్సిపల్ కార్యాలయం ఎదుట
నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనులకు నిధుల వివరాలు, సాధారణ, అత్యవసర సమావేశాల్లో కౌన్సిల్ తీర్మానం చేసిన అంశాలను ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరిన స్పందించడం లేదని వైసీపీ రెబల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయన నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ నిధులు దుర్వినియోగం అయ్యాయని, కౌన్సిలర్లకు తెలియకుండానే కొన్నా అంశాలను తీర్మానించినట్లు రికార్డుల్లో పొందుపరిచారని విమర్శించారు. సంబంధిత పత్రాలు ఇవ్వాలని తాను సమాచార హక్కు చట్టం కింద కోరి 70 రోజులు గడుస్తున్ని ఇప్పటిదాకా అతీగతీ లేదన్నారు. ఈ క్రమంలో కమిషనర్ షేక్ ఫజుల్లులా అక్కడకు చేరుకుని భాస్కర్‌రెడ్డిని సముదాయించారు. ఇటీవల తాను బాధ్యతలు తీసుకున్నానని, త్వరలో కోరిన సమాచారాన్ని ఇస్తానని హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు.


- ఆత్మకూరు

డబుల్ ఎంట్రీలు..

మృతులకూ స్థానం!

ఓటర్ల జాబితాలో వింతలు

- నెల్లూరు నగరంలో ఎన్నెన్ని సిత్రాలో!
- ఫారం-7 దరఖాస్తులు తిరస్కరించారు సరే..
- మరి ఓటర్లు ఎక్కడున్నారో!?
- సరైన సమాధానం ఇవ్వలేని బీఎల్వోలు



నెల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్ని విమర్శలు వచ్చినా.. మరిన్ని ఫిర్యాదులు అందినా.. ఆఖరుకు ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకున్నా ఓటర్ల జాబితా తప్పుల తడకగానే ఉంది. డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్లను తొలగించకపోవడం, కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినా వారి ఓట్లు ఇంకా స్థానికంగా ఉండటం.. వంటి అనేక విచిత్రాలు జాబితాలో దర్శనమిస్తున్నాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలపై భారీగా ఫిర్యాదులు అందడంతో గతేడాది ఎన్నికల సంఘం డోర్ టు డోర్ సర్వే నిర్వహించింది. ఆ తర్వాత ప్రత్యేక సమ్మరీ రివిజన్ జరిగింది. జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల ముసాయిదాను ప్రచురించాల్సి ఉన్నా అభ్యంతరాలు భారీగా రావడంతో ఓటర్ల జాబితాను స్వచ్ఛంగా రూపొందించేందుకు జనవరి 22వ తేదీ వరకు అధికారులకు సమయమిచ్చింది. అయినా ఫలితం లేదు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పరిశీలిస్తే అనేక లోపాలు బయటపడు తున్నాయి. షేక్ కరీమున్నీసా అనే వ్యక్తికి జాకీర్ హుస్సేన్ నగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల 2వ తరగతి రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. అదే వ్యక్తికి పక్కనే 1వ తరగతి రూమ్‌లో ఉన్న మరో పోలింగ్ కేంద్రంలో కూడా ఓటు ఉంది. ఈ రెండు ఓట్లకు సంబంధించిన ఎపిక్ నంబర్లు కూడా వేర్వేరు కావడం గమనార్హం. షేక్ ఖాదర్ అనే మరో వ్యక్తికి నవాబుపేటలోని



మున్సిపల్ హైస్కూల్ రెండవ తరగతి రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. ఇదే వ్యక్తికి ఎస్‌సీ బాలయ్య నగర్‌లోని మున్సిపల్ స్కూల్ పదో తరగతి ఏ సెక్షన్ రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో కూడా ఓటు ఉంది. ఈ రెండు ఎపిక్ కార్డులు కూడా వేర్వేరు. షేక్ కరీమున్నీసా అనే ఇంకో వ్యక్తికి మూలాపేట వేద సాంస్కృతిక కాలేజీ ఆఫీసు రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. అలానే అదే కాలేజీ ఆగమ భవన్‌లోని పోలింగ్ కేంద్రంలో కూడా మరో ఓటు ఉంది. ఈ రెండు ఓట్లకు సంబంధించి ఎపిక్ కార్డులు కూడా వేర్వేరుగా ఉన్నాయి. ఇటువంటి డబుల్ ఎంట్రీలు సిటీలో అనేకం కనిపిస్తున్నాయి.

ఆ ఓటర్లు ఎక్కడున్నారో..?

పలుచోట్ల మృతులు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వ్యక్తులకు కూడా స్థానికంగా ఓట్లు ఇంకా ఉన్నాయి. వీటిపై ప్రతిపక్ష పార్టీలు ఫారం-7 దరఖాస్తులు అందజేసినా ఆ ఓట్లను తొలగించలేదు. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలంటే ఫారం-7 దరఖాస్తుతోపాటు డెత్ సర్టిఫికెట్ కూడా అడగడంతో చాలా మందికి ఆ సర్టిఫికెట్ దొరక్క దరఖాస్తు చేయలేదు. కొన్ని దరఖాస్తులు చేసినా వాటిని బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అలా జరగలేదు. 43వ డివిజన్‌లోని 67,68 పోలింగ్ కేంద్రాల్లో ఉన్న చనిపోయిన వారి ఓట్లే ఇందుకు ఉదాహరణ. అలానే కొందరు ఆ ప్రాంతం వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోగా అటువంటి ఓట్ల తొలగింపునకు కూడా ఫారం-7 దరఖాస్తులు అందాయి. కానీ వీటిలో చాలా వాటిని అధికారులు తిరస్కరించారు. అంటే వీరంతా స్థానికంగానే ఉన్నట్లు నిర్ధారిం చారు. మరి వారు ఎక్కడున్నారన్నది మాత్రం ప్రతిపక్ష పార్టీల నాయకులకు తెలియడం లేదు. మేము పెట్టిన ఫారం-7 దరఖాస్తులను తిరస్కరించారు సరే.. పోనీ ఆ ఓటర్లు ఎక్కడున్నారో చెబితే మేము ఓటు అభ్యర్థించుకుంటాం.. అంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నా బీఎల్‌వోల నుంచి సరైన సమాధానం ఉండటం లేదు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

- నేడు నెల్లూరులో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- 154 నమూనాల ప్రదర్శన.. విస్తృత ఏర్పాట్లు



అధికారులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 12 : విద్యార్థుల మదిలో మెదిలే సమస్యలకు పరిష్కారం, సమాజానికి మేలు చేసే ఆలోచనలకు రూపమివ్వడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నాలు చేయడమే లక్ష్యంగా ఇన్‌స్పైర్ మనక్ పని చేస్తుంది. కొత్తదనాన్ని ప్రోత్సహించి ఆవిష్కరణల దిశగా వారిని నడిపిస్తోంది. వీటిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో 2022-23 విద్యా సంవత్సరానికి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విస్తృత ఏర్పాట్లు చేశారు. మంగళవారం జరిగే ఈ ప్రదర్శనలో 154 నమూనాలను విద్యార్థులు ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో 18 కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీల్లోని సభ్యులంతా సక్రమంగా విధులు నిర్వర్తించి విజయవంతం చేయాలని డీఈఓ రామారావు ఆదేశించారు. ఎంపికైన విద్యార్థులంతా నాణ్యమైన ప్రాజెక్టులతో హాజరు కావాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్టాల్స్, సభా ప్రాంగణం, సమావేశ మందిరం తదితర ఏర్పాట్లను సంబంధిత అధికారులు పరిశీలించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నెల్లూరు, కావలి డిప్యూటీ ఈఓలు ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, ఎంఈఓలు మురళీధర్, బిక్షాలు, అబ్దుల్ హమీద్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

'సోమశిల'లో 22.205 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 12 : సోమశిల జలాశయంలో 22.205 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, రోజురోజుకు నీటిమట్టం దిగజారుతుండటంతో రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

● జిల్లాలో 346 పోస్టుల భర్తీకి ఆమోదం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 12 : ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ సోమవారం ఆరంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 6100 పోస్టులకుగాను జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు ఫీజు చెల్లించి సీఎస్‌ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఈ నెల 27 నుంచి మార్చి 9వతేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో టెట్ నిర్వహించి మార్చి 14న ఫలితాలు విడుదల చేస్తారు. ఏపీ డీఎస్సీ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్‌లను మార్చి 5వతేదీన జారీ చేసి, అదే నెల 15 నుంచి 30వతేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో డీఎస్‌సీ పరీక్షలు ఉంటాయి. డీఎస్సీ ప్రాథమిక కీని మార్చి 31న విడుదల చేసి ఏప్రిల్ 1వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 2న తుది కీ విడుదల చేసి 7న ఫలితాలు వెల్లడిస్తారు ఈ పరీక్షలు 2018 డీఎస్సీ సిలబస్ ప్రకారమే నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు.

● జిల్లాలో 346 పోస్టులు

సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) విభాగంలో పాఠశాల విద్యకు 102, ట్రైబల్ వెల్ఫేర్‌కు 2 పోస్టులు కలిపి మొత్తం 104, స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)ల విభాగంలో పాఠశాల విద్యకు 137, ట్రైబల్ వెల్ఫేర్‌కు 2, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌కు 1 కలిపి మొత్తం 140, టీజీటీల విభాగంలో ఏపీ మోడల్‌స్కూల్స్‌కు 17, సోషల్ వెల్ఫేర్‌కు 18, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌కు 55, ఏపీ రెసిడెన్షియల్‌కు 12 కలిపి మొత్తం 102 పోస్టులు కేటాయించారు.

ఎండుతున్న పైరు..

రైతు కంట కన్నీరు!



ఎన్నో ఆశలతో అన్నదాత సాగు చేసిన వరికి నీరందడం లేదు. దీంతో పగుళ్లిచ్చిన భూమిలో పైరు ఎండుతుండటంతో కర్షకుడు కుమిలిపోతున్నాడు. చేజర్ల మండలంలోని కండాపురం, కాకివాయి, నాగులవెల్లటూరు తదితర గ్రామాల్లో దక్షిణ కాలువ కింద వరి సాగవుతోంది. ఎన్నడూ లేని విధంగా ఈ కాలువకు వచ్చే నీటిని వారంలో నాలుగు రోజులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో నీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. సోమశిల డ్యాం నుంచి వంద కి.మీ దూరం పైన ఉండే గ్రామాలకు సమృద్ధిగా నీరు అందుతూ రెండు కార్లు పంటలు పండిస్తున్నారని, కేవలం పట్టుమని 20 కి.మీ దూరం కూడా లేని తమ గ్రామాలకు ఒక కారు పంటకు కూడా నీరివ్వక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క చేజర్ల మండలమే కాకుండా 10 కి.మీ కూడా దూరం లేని కలువాయి మండలంలోని కుల్లూరు, మాదన్నగారిపల్లి, పెన్నబద్వేల్, నూకనపల్లి, తెలుగ రాయపురం, తోపుగుంట, అగ్రహారం, కనుపూరుపల్లి, వెరుబొట్లపల్లి, వెదరపర్తి తదితర గ్రామాల్లోనే ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత యంత్రాంగం స్పందించి సాగుకు నీరందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

- చేజర్ల

మిర్చి రైతు దిగాలు

దిగుబడిపై తెగుళ్ల ప్రభావం ● మద్దతు ధర కూడా అంతంతే!

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 12 : మిర్చి పంట రైతు కంట్లో కారం కొట్టింది. పంటకు ఆకు ముడత తెగులు సోకడం, కాలం కలిసిరాక పోవడం అన్నిటికీ మించి వర్షాభావంతో దిగుబడులు తగ్గిపోయాయి. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు లాభాలు ఆర్జించారు. దీంతో గతేడాది డిసెంబరు నుంచి కోటి ఆశలతో అధిక విస్తీర్ణంలో మిర్చి సాగు చేశారు. వలేటివారిపాలెం మండలంలో చుండి, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, లింగసాలెం, అంకభూపాలపురం, జమీన్ ఉప్పలపాడు, పోలినేనిపాలెం, కూనిపాలెం పోకూరు కొండసముద్రం, బండివారిపాలెం తదితర గ్రామాలలో 9వేల ఎకరాల్లో మిర్చి సాగు అయ్యింది. ఎకరాకు రూ.2 లక్షలకుపైగానే పెట్టుబడులు పెట్టారు. అయితే, గత నెలలో కురిసిన వర్షాలకు ఆకు ముడత తెగులు సోకడంతో దిగుబడిపై ప్రభావం చూపింది. ఆ తర్వాత కూడా వర్షాభావంతో మొక్కలు ఎండుముఖం పట్టాయి. గతేడాది ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఇప్పుడు 15 నుండి 20 క్వింటాళ్లలోపు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. 20 రోజులుగా ముమ్మరంగా మిర్చి కోతలు కోసి కళ్లాల్లో ఆరబెట్టారు. దళారులకు విక్రయాలు కూడా జరుపుతున్నారు. కొంతమంది గుంటూరు మిర్చి యార్డుకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. గతేడాది క్వింటం గరిష్ఠంగా రూ.21వేల వరకు పలకగా, ఇప్పుడు రకాన్ని బట్టి రూ.15 వేల నుంచి 19 వేలకు కొనుగోలు చేస్తున్నారు. అసలే తెగుళ్లతో దిగుబడులు రాక అల్లాడుతుంటే దళారులు నిలువునా మోసం చేస్తున్నారని, గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మిర్చిని గోతాలలో పోస్తున్న కూలీలు



అటవీ శాఖ భూముల్లో
సాగు చేస్తున్న రొయ్యల గుంతలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

ప్రభుత్వ భూమేగా

చేసేయ్ కబ్జా!

దక్షిణ కాశీగా పేరొందిన విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలోని తీరం ప్రాంతంలో కబ్జాల పరంపర కొనసాగుతోంది. వందల ఎకరాల ప్రభుత్వ, అటవీ శాఖ భూములు ఆక్రమణకు గురవుతుండగా వీటిని లీజుకు ఇచ్చి కబ్జారాయుళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై రామలింగేశ్వర స్వామి భక్తుడు, ఇస్కపల్లికి చెందిన కొండూరు మాధవ్ గతేడాది 'స్పందన'లో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అయితే, నెలలు గడుస్తున్నా తీరంలో భూ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సోమవారం కూడా ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు.

- ఆక్రమణదారుల చెరలో రామతీర్థం తీరం
- రొయ్యల గుంతలుగా మారుతున్న భూములెన్నో!
- గతేడాది కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా బేఖాతర్
- ఇప్పుడు మళ్లీ అధికారులకు మొర

విడవలూరు, ఫిబ్రవరి 12 : విడవలూరు మండలంలో ఊటుకూరు పెద్దపాళెం నుంచి పొన్నపూడి కొత్తూరు వరకు సుమారు 500 ఎకరాల అటవీ శాఖ, సీలింగ్ భూములు ఉన్నాయి. ఎంతో విలువైన ఈ భూములను కొంతమంది ఆక్రమించి రొయ్యల గుంతలుగా మార్చేశారు. రామతీర్థం గ్రామం రామలింగాపురం సమీపంలో సర్వే నెం.910-3లో సుమారు 25 ఎకరాలు, మరో సర్వే నెం.184-బిలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ, అటవీ శాఖకు చెందిన భూములు ఉన్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో కొంతమంది ఈ భూములను ఆక్రమించుకున్నారు. అటవీ శాఖ భూముల్లో ఉన్న సవక చెట్లను తెగనరికి రొయ్యల గుంతలుగా మార్చేశారు. ఇలా వేసిన రొయ్యల గుంతలను ఎకరాకు రూ.3 లక్షల 5లక్షల చొప్పున ఇతరులకు లీజుకు ఇచ్చేస్తున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా
ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

● యథేచ్ఛగా విద్యుత్ కనెక్షన్లు

ప్రభుత్వ నిబంధనలు కాలరాసిన విద్యుత్ శాఖ అధికారులు ఆక్రమిత భూములకు యథేచ్ఛగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. ఈ మేరకు భారీగానే ముడుపులు తీసుకుని పట్టాలు ఉన్న రైతుల పేరిట స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి మరీ కనెక్షన్లు ఇచ్చారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సముద్ర తీరం సమీపంలో మోటార్లు ఏర్పాటు చేసుకుని రొయ్యల గుంతలను ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారు.

● పట్టించుకోని అధికారులు

రామతీర్థంలోని తీర ప్రాంతం కబ్జాకు గురైనందున రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, సముద్రంలో స్నానమాడిన వారికి చర్మవ్యాధులు వస్తున్నాయని రామలింగేశ్వర స్వామి భక్తజన బృందం సభ్యులు, ఇస్కపల్లికి చెందిన కొండూరు మాధవ్ గత ఏడాది నవంబరు 6న కలెక్టరుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. అయితే సంబంధిత అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయన రెండోవ సారి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైన సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని అయన కొరుతున్నారు.

విచారిస్తున్నాం!

రామతీర్థం తీరప్రాంతంలో ఆక్రమణకు గురైన భూములపై గతంలో ఫిర్యాదు చేసిన విషయం నా దృష్టికి రాలేదు. అయినా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాము.

- భానుప్రకాష్, ఇన్‌చార్జి తహసీల్దారు

హైకోర్టును ఆశ్రయిస్తా...



తీరంలో ఆక్రమణలపై గతంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. భూముల ఆక్రమణ రోజురోజుకు ఎక్కువవుతోంది. దీంతో రెండోసారి కూడా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాను.

- కొండూరు మాధవ్, రామలింగేశ్వర స్వామి భక్తుడు

19 నుంచి అష్టలక్ష్మీ యాగం

● వీఆర్సీ మైదానంలో మార్చి 3 వరకు నిర్వహణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న రఘునాథాచార్యులు తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 12 : నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో ఈ నెల 19 నుంచి మార్చి 3వ తేదీ వరకు లోక కల్యాణం కోసం అష్టలక్ష్మీ యాగం నిర్వహిస్తున్నట్లు శ్రీఅష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకుడు పీతాంబర రఘునాథాచార్యులు తెలిపారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు 21 ప్రాంతాల్లో యాగం నిర్వహించామని, 22వ యాగం నెల్లూరులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అతిథులుగా కర్నాటక నుంచి శఠగోప రామానుజ జీయర్, బృందావనం నుంచి అష్టాక్షరీ రామానుజ జీయర్, తమిళనాడు విల్లిపుత్తూరు నుంచి శఠగోప రామానుజ జియ్యర్ స్వామి, హైదరాబాద్ నుంచి దేవనాథ జియ్యర్ స్వామిజీలు హాజరవుతారని తెలిపారు. అనంతరం యాగానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ వైభవ దీపిక, యాగం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్పందనలో కలెక్టర్ హరినారాయణన్

అర్జీలు పునరావృతం కాకుండా చూడండి

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 12 : వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిష్కరించాలన్నారు. ఒక వేళ అర్జీలు పరిష్కరించకపోతే ఎందుకు పరిష్కరించలేదో తెలియచేయాలన్నారు.

● సోమశిల జలాయశయం అభివృద్ధికి, సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ బీజేపీ నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జలాశయం ముందు భాగంలో దెబ్బతిన్న అప్రాన్, స్పిల్‌వే, రక్షణ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. అలాగే నెల్లూరుప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అందించే ఆసరా నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని కోరారు.

● కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆ పాఠశాలలో 450 మంది గిరిజన, పేద విద్యార్థులు ఉన్నారని, వారికి తాగడానికి, స్నానాలు చేయడానికి నీరు లేదని చెప్పారు. విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవన్నారు.

● నగరంలోని బీసీ భవన్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చ అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆ భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ అర్ధాంతరంగా ఆపేశారని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

● కడప జిల్లా పులివెందులలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం పాదాల కింద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టడాన్ని అవమానంగా భావిస్తున్నామని, ఆ విగ్రహాన్ని అక్కడ నుంచి తొలగించి వేరొక చోట ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బీ.శ్రీనివాస్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

పొదుపు సొమ్ము స్వాహాపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట మహిళల ధర్నా

పొదుపు డబ్బులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తోటపల్లిగూడూరు మండలంలోని పొదుపు మహిళలు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట పొదుపు మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తోటపల్లిగూడూరు మండలంలో తాము పొదుపు చేసుకున్న లక్షలాది రూపాయలను వీవోఏ, ఏపీఎం, ఏసీలు స్వాహా చేశారని ఆరోపించారు. వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ పోరాట సమితి అధ్యక్షుడు జాలాది శ్రీనివాసులు, పొదుపు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరికి గాయాలు

కొడవలూరు ఫిబ్రవరి 12: మండలంలో రాచర్లపాడు జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు సోమవారం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు, కావలి నుంచి నెల్లూరు వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడినవారిని ప్రైవేటు వాహనంలో నెల్లూరుకి తరలించారు. వారి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

సీసీఎస్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12: నెల్లూరు సీసీఎస్ డీఎస్పీగా పీ.రామకృష్ణాచారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1995లో పోలీసుశాఖలో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన చిత్తూరు జిల్లాలో ఎస్ఐగా, సీఐగా విధులు నిర్వహించారు. ఇటీవలే డీఎస్పీగా పదోన్నతి పొందారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ డాక్టర్ కె తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12: మద్యం మత్తులో ఉన్న వ్యక్తి హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటన ఆత్మకూరు బస్టాండు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరుకు చెందిన రవి మర్రిపాడు పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆదివారం రాత్రి నెల్లూరుకు వచ్చారు. పనులు చూసుకుని తిరిగి కోవూరుకు వెళ్లేందుకు ఆటో కోసం ఆత్మకూరు బస్టాండు వద్ద వేచి ఉండగా అదే సమయంలో రామకోటయ్యనగర్‌కు చెందిన రెహమాన్ మద్యం సేవించి బస్టాండు వద్ద ఆటో డ్రైవర్లతో గొడవ పెట్టుకుంటూ రవికు కన్పించాడు. అలా ఎందుకు చేస్తున్నావని రెహమాన్‌ను ప్రశ్నించడంతో కోపోద్రిక్తుడైన అతను రవిపై దాడి చేశాడు. ఈ మేరకు బాధిత హెడ్‌కానిస్టేబుల్ నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నివాసంలోకి దూసుకెళ్లిన పాల వ్యాను

● డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



నివాసంలోకి దూసుకెళ్లిన పాల వ్యాను

వరికుంటపాడు, ఫిబ్రవరి 12: వేగంగా వెళ్తున్న పాలవ్యాను అదుపు తప్పి ఓ నివాసంలోకి దూసుకెళ్లిన సంఘటన సోమవారం రామాపురంలో చోటుచేసు కుంది. వివరాల మేరకు దుత్తలూ రు నుంచి ప్రకాశం జిల్లా పామూ రు వైపు 565 జాతీయ రహదారి పై వెళ్తున్న వ్యాను ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి సమీపం లోని నివాసంలోకి దూసుకెళ్లింది. దీంతో కొంతమేర గోడ కూలిపో వడంతో పాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తెల్లవారుజాము కావడంతో డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతోనే ప్రమాదం సంభవించింది.

విద్యుదాఘాతంతో బేల్దారి కూలీ మృతి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12: పెయింట్ పనుల కోసం సారవ కడుతుండగా ప్రమాదవశాత్తు సవక కర్ర విద్యుత్ వైర్లకు తగిలి విద్యుదాఘాతానికి గురై కిందపడి బేల్దారి కూలీ మృతి చెందిన ఘటన నగరంలోని హరనాథపురంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంకు చెందిన లక్ష్మీనారాయణ(52), లక్ష్మి దంపతులు ఉపాధి నిమిత్తం 18 ఏళ్ల క్రితం నెల్లూరుకు వచ్చారు. ప్రస్తుతం ఉమ్మారెడ్డిగుంటలో ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం లక్ష్మీనారాయణ హరనాథపురంలోని పెయింట్ వేసేందుకు సారవలు కట్టేందుకు వెళ్లారు. రెండో అంతస్థులో సారవ కడుతుండగా చేతిలో ఉన్న సవక పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై ఆయన పైనుంచి కిందపడి తలకు తీవ్రగాయమై మృతి చెందాడు. గమనించిన సహచరులు మృతుడి భార్య లక్ష్మికి సమాచారం అందించారు. ఆమె సంఘటన స్థలానికి చేరుకుని భర్త మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరైంది. ఈ మేరకు బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ శ్రీనివాసరాజు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించారు.

జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడిగా జానీ మాస్టర్

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 12: జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన షేక్ జానిమాస్టర్‌ను ఆ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. అలాగే చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు ఈగి సురేష్‌ను ప్రచార కమిటీ ఉమ్మడి నెల్లూరు జిల్లా కో ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. జానీమాస్టర్, ఈగి సురేష్‌లకు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అభినందనలు తెలిపారు.

వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 12 : తనను మానసికంగా, శారీరకంగా మాజీ మంత్రి పొంగూరు నారాయణ వేధిస్తున్నారని ఆయన తమ్ముడి సతీమణి ప్రియ సోమవారం నెల్లూరులో జరిగిన పోలీసు స్పందనలో ఫిర్యాదు చేశారు. నారాయణ వేధింపుల వల్ల తాను తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, పోలీసు అధికారులు సమగ్రంగా విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె కోరారు.

సాంఘిక సంక్షేమ హాస్టళ్లను కాపాడాలి

● కలెక్టరేట్ ఎదుట దళిత సంఘర్షణ సమితి ధర్నా

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 12 : సంక్షోభంలో ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లను కాపాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి కోరారు. ఈ మేరకు సోమవారం దళిత సంఘర్షణ సమితి నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70కి పైగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు లేవన్నారు. విద్యార్థులకు కప్పుకోవడానికి కనీసం దుప్పట్లు కూడా లేవన్నారు. ఇప్పటి వరకు గ్లాసులు, ప్లేట్లు, ట్రంకుపెట్టెలు ఇవ్వలేదని ఆరోపించారు. బాలికలకు సబ్బు, చమురుకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఉందని తెలిపారు. జగనన్న నాడు-నేడు పథకం ద్వారా సంక్షేమ హాస్టళ్లకు రూ.1000 కోట్లు ఇస్తామని చెప్పి, వెయ్యి పైసలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 5 ఏళ్ల నుంచి ఒక తలుపు, కిటికీ కాని పెట్టలేదన్నారు. బాలికల స్నానాల గదులకు తలుపులు ఊడిపోయి హీన స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల బెడదతో అనేక మంది హాస్టళ్లను వదిలి వెళ్లిపోతున్నారన్నారు. తక్షణమే ఆ హాస్టళ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు.



ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నాయకులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	252
స్కిన్‌లెస్	280
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5952
వెండి కిలో ధర	రూ. 72,600
వెండి ఒక గ్రాము	రూ. 74.60

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



వృద్ధుడి సమస్య వింటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12: గ్రామాల్లో సంచరిస్తూ మాయ మాటలు చెప్పే అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారు వస్తే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల వేదిక (స్పందన)కు జిల్లా వ్యాప్తంగా 112 మంది తరలివచ్చి వారి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దివ్యాగులు, సీనియర్ సిటిజన్‌లు, మహిళల సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. హత్య కేసుల్లో క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీసి నిందితులపై తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. వరకట్నం వేధింపులకు పాల్పడడం, నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని బెదిరించడం వంటి ఫిర్యాదులపై తక్షణం స్పందించి అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రేమ పేరుతో వంచించడం, పెళ్లి చేసుకోమని వెంటబడటం వంటి సున్నిత అంశాలపై తగిన విచారణ జరిపి బాధితులకు న్యాయపరమైన రక్షణ కల్పించాలన్నారు. చోరీ కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు అందజేయాలని ఆదేశించారు.

'విశ్వకర్మ' శిక్షణ కేంద్రంపై ఢిల్లీ బృందం విచారణ



న్యాక్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి ఉదయగిరి పట్టణంలో ఏర్పాటుచేసిన ఓ శిక్షణ కేంద్రంపై సోమవారం ఢిల్లీ బృందం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆంధ్ర, తెలంగాణ రీజనల్ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు, జాయింట్ డైరెక్టర్ విద్యానంద్‌లు మాట్లాడుతూ చేతివృత్తుల వారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఉదయగిరి పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ శిక్షణ కేంద్రం శిక్షణ సక్రమంగా ఇవ్వడంలేదని, లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి వసతులు, తరగతుల నిర్వహణ తీరుతోపాటు లబ్ధిదారులను విచారించడం జరిగిందన్నారు. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన న్యాక్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మౌళి, జిల్లా శిక్షణాధికారులు అప్పారావు, ప్రకాష్ పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానం దుర్మార్గం : యూటీఎఫ్

● డీఎస్సీ జీవో ప్రతుల దహనం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 12 : పోరాటాలతో రద్దు చేసుకున్న అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ తీసుకురావడం దుర్మార్గమని యూటీఎఫ్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో అప్రెంటీస్ విధానం తీసుకురావడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దకాలం అనేక ఉద్యమాలు, పోరాటాలు, దీక్షలు చేసి ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేసుకోవడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ విధానాన్ని మళ్లీ పునరుద్ధరించి అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చెప్పిన మాటలను మరిచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ అనాలోచిత నిర్ణయాలకు స్వస్తి పలకకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతిశర్మ, కార్యదర్శి కె.నాగిరెడ్డి, నేతలు వీ.శీనయ్య, ఎస్‌కె.రియాజ్, పీ.పెంచలనరసింహులు, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



జీవో ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

డ్రైవర్లకు శాపం.. క్రిమినల్ చట్టం 106

● ప్రమాదానికి నిర్వచనం మార్పు ● వాహనదారులందరికీ శిక్షే..

● ఈ చట్టాన్ని విరమించుకోవాలి : వాహనచోదకులు

ముత్తుకూరు, ఫిబ్రవరి 12: అనుకోకుండా పొరపాటున జరిగే సంఘటనలు ఇకపై డ్రైవర్ల పాలిట శాపంగా మారనున్నాయి. ప్రమాదానికి నిర్వచనం మార్చిన కేంద్ర ప్రభుత్వం, కావాలని చేసే సంఘటనగా భావించి భారత న్యాయ సంహితలో క్రిమినల్ చట్టం 106కు ఆమోదం తెలిపింది. సెక్షన్ 106 ప్రకారం డ్రైవర్లు నిర్లక్ష్యంగా, దురుసుగా, కావాలని డ్రైవింగ్ చేసి వ్యక్తుల మరణానికి కారణమవుతున్నందున పదేళ్ల జైలుశిక్ష, రూ.10లక్షల జరిమానా విధించాలని చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం పరిధిలోకి లారీడ్రైవర్లు, ట్రక్కు, బస్సు, ఆటో డ్రైవర్లే కాకుండా ద్విచక్ర వాహనదారులు కూడా వస్తారు. ఇకపై అనుకోకుండా ప్రమాదం జరిగినా సెక్షన్ 106 డ్రైవర్లకు ఉరితాడుగా మారనుంది.

● పలు రాష్ట్రాల్లో వ్యతిరేకత



దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ చట్టం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. గత డిసెంబరు 21న లోక్‌సభ ఆమోదం పొందిన ఈ క్రిమినల్ చట్టం 106(1), 106(2)కు అదేనెల 25న రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఇక చట్టం అమల్లోకి రావడమే తరువాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 16న రవాణా రంగంలోని డ్రైవర్లు జాతీయ, గ్రామీణ బంద్‌ను చేపట్టనున్నారు. బ్రిటీష్ హయాంలో 1860లో ఇండియన్ పీనల్‌కోడ్ 304ఏ ప్రకారం రోడ్డు ప్రమాదంలో వాహనం ఢీకొని మరణం సంభవిస్తే తప్పిదం ప్రకారం రెండేళ్లవరకు జైలుశిక్ష లేదా జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉంది. స్వతంత్రం వచ్చిన 75 ఏళ్ల తర్వాత ఇప్పుడు హిట్ అండ్ రన్ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకురావడం దారుణమని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టం 106(2) ప్రకారం ప్రమాదం సంభవించిన సమయంలో డ్రైవర్లు సంఘటనా స్థలం నుంచి పారిపోకుండా ఉంటే ఐదేళ్ల జైలుశిక్ష, రూ.5లక్షల జరిమానా విధించవచ్చు. అయితే ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే మృతుల బంధువులు, చుట్టుపక్కలవారు క్షణికావేశంలో డ్రైవర్‌పై దాడి చేసి ప్రాణాలకు ప్రమాదం తలపెట్టే అవకాశాలే ఎక్కువ. సాధారణంగా ప్రమాదంలో ఎవరైనా మృతిచెందితే డ్రైవర్లు భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయే పరిస్థితులే అధికంగా ఉంటాయి. కేవలం ఈ కారణంగా పదేళ్ల జైలుశిక్ష, రూ.10లక్షల జరిమానా విధించడం ఎంతవరకు న్యాయమని రవాణారంగ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి లోటుపాట్లు ఉన్న క్రిమినల్ చట్టం 106ను అమలు చేయాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కల్లూరుపల్లి భూ ఆక్రమణపై ఉన్నతాధికారుల ఆరా

● సమగ్ర వివరాల సమర్పణకు ఆదేశాలు?

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 12: నెల్లూరు రూరల్‌లోని కల్లూరుపల్లి వద్ద ప్రభుత్వానికి చెందిన నాలుగున్నర ఎకరాల భూమి ఆక్రమణలకు గురికాగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ ఉదంతాన్ని ఆంధ్రజ్యోతి సోమవారం వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ భూమి విలువ బయట మార్కెట్లో రూ.9 కోట్లు ఉంది. అలాంటి విలువైన భూమి కబ్జాకు గురవడాన్ని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కల్లూరుపల్లిలోని ఓ చెరువు వద్ద ఆక్రమణకు గురైన భూమి వివరాలను సమగ్ర నివేదికతో సమర్పించాలని కలెక్టరేట్ నుంచి మండల రెవెన్యూ కార్యాలయానికి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. మరోపక్క ఆక్రమణకు పాల్పడిన వారి వివరాలను కూడా రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నట్లు సమాచారం.

● వరికుంటపాడు కథనం పైనా ఆరా..

వరికుంటపాడు : 'నేతలు చెప్పిందే వేదం' కథనం పైనా ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. సోమవారం ఎమ్పీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో ఓ సమావేశంలో ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనంపైనే చర్చ సాగింది. సమాచారాన్ని ఎవరు అందజేశారని ఆరా తీశారు. అయితే, వాస్తవ కథనాన్నే ప్రచురించారనే ఉద్దేశంతో అందరూ మౌనం వహించాల్సి వచ్చింది. అనంతరం ఎమ్పీడీవో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేయడంతో పాటు జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డీ సికిందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 9,421 మంది హాజరు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 12 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్)లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 107 పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన పరీక్షకు 9.421 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 5,123 మందికి 4,976 మంది హాజరు కాగా 147 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్నాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 4,536 మంది హాజరు కావాల్సి ఉండగా 4,445 మంది హాజరు కాగా 91 మంది గైర్హాజరయ్యారు. ఉద యం, మధ్నాహ్నం కలిపి మొత్తం 9,659 మంది హాజరు కావాల్సి ఉండగా 9.421 మంది హాజరు కాగా 238 మంది గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ జరుగుతున్న పలు పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వహణ కన్వీనర్, ఆర్ఐఓ డాక్టర్ ఏ.శ్రీనివాసులు, డీఈసీ సభ్యులు పరిశీలించారు.

సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ

● అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం నిర్ణయం

● రైతులకు పారదర్శక సేవలు



నెల్లూరు (హరనాథపు రం), ఫిబ్రవరి 12 : సహకార సంఘాల్లో అక్రమాలకు పూర్తి స్థాయిలో చెక్ పెట్టడానికి, రైతులకు పారదర్శక సేవలు అందించడానికి ఆ సంఘాల కంప్యూటరీకరణకు కేంద్ర ప్రభు త్వం ఉపక్రమించింది. ఈ మేరకు జిల్లాకు ఆదేశాలు అందడంతో కంప్యూటరీకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేయించడానికి ఆ శాఖ అధికారులు సమాయత్తమయ్యారు. కొన్ని సహకార సంఘాల్లో అవినీతి, అక్రమాలు పెరిగిపోయి ఉద్యోగుల్లో జవాబుదారీతనం లేకుండా పోయింది. ఇష్టారాజ్యంగా రుణాల మంజూరు, ఆశించినస్థాయిలో రీషెడ్యూలు లేకపోగా లెక్కలు కూడా సరిగ్గా ఉండటం లేదు. ఇలాంటి వ్యవహారాలకు కంప్యూటరీకరణ ద్వారా పూర్తిస్థాయిలో చెక్‌పెట్టనున్నారు. ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగితే సహకార సంఘాల పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో ఎక్కడ నుంచైనా చూసుకోవచ్చు.

కామన్ సర్వీస్ కేంద్రాలుగా..

జిల్లాలో మొత్తం 78 సహకార సంఘాలు ఉండగా, దాదాపు 70 సెంటర్లను కామన్ సర్వీసు సెంటర్లుగా మార్పు చేశారు. మీసేవా కేంద్రాల్లో అందించే అన్ని సేవలను ఇక్కడ అందిస్తున్నారు. ఉదాహరణకు బస్సు, రైల్వే టికెట్ల బుకింగ్, విద్యుత్, ఇతర బిల్లుల చెల్లించే అవకా శం కల్పించారు. సాధారణంగా సహకార సంఘాల్లో వ్యవ సాయరుణాలు, ఎరువులు తదితరాలను అందజేస్తుంటారు. వాటి ఆర్థిక పురోభివృద్ధి కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 78 సహకార సంఘాల్లో 60 సంఘాలు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ఆర్థిక చేయూత పొందుతూ రైతులకు సేవలందిస్తున్నాయి. ఈ సంఘాలలో తొలుత కంప్యూటరీకరణ ప్రక్రియను ఒక పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారు రాష్ట్రవ్యాప్తంగా 2037 సొసైటీల్లో కంప్యూటరీకరణ ప్రక్రియ కోసం కేంద్రం రూ.80 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తంతో కంప్యూటర్ల కొనుగోలు, ఇంటర్నెట్ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు.

20లోగా పూర్తి చేయిస్తాం..

సహకార సంఘాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేయించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈనెల 20వ తేదీ లోపు తొలుత 60 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి చేయిస్తాం.

– బాలిరెడ్డి సుధాభారతి, జిల్లా సహకారశాఖాధికారి

నిరుద్యోగుల వయోపరిమితి ఐదేళ్లు పెంచాలి : యూటీఎఫ్



ఉదయగిరి రూరల్: డీఎస్సీ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



సీతారామపురం : జీవో కాపీలను దహనం చేస్తున్న మండల నాయకులు



ఏఎస్ పేట: పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఎదుట సోమవారం యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు ఎడమ తిరుపతయ్య మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం రద్దయిన అప్రెంటీస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. గత ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహించనందున నిరుద్యోగుల వయోపరిమితి మరో ఐదేళ్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనీఫ్, ఎం ఫణిరాజు, నాయకులు సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటరెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదురుగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతుల దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్షుడు బోగ్యం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గొడ్లవేటి వెంకటేశ్వరు, జిల్లా కార్యదర్శి తిరుపతయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పేరాల శ్రీనివాసులు, నాయకులు బాలకృష్ణరెడ్డి, అన్నంగి ప్రసాద్, సుబ్బారావు, లక్ష్మయ్య, సురేష్, డి వెంకటేశ్వర్లు, బాల గురవయ్య, ఆనందేశ్వరయ్య, శంకర్‌రెడ్డి, మహేష్, పవిత్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

ఏఎస్ పేట: సీపీఎస్ రద్దు చేయాలని మండల యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక జడ్పిహైస్కూల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎస్ రద్దుచేసి పాత విధానం పునరుద్ధరించాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు అన్ని పార్టీల నాయకులకు పోస్టు కార్డులను పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు మల్లికార్జునరావు, మండల గౌరవ అధ్యక్షుడు జిలాని పాషా, ప్రధాన కార్యదర్శి ఖాజా రహమతుల్లా, నాయకులు సుబ్బయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ బొమ్మతో ఇంటి పత్రం



ఉదయగిరి, ఫిబ్రవరి 12: జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం సిద్ధం చేసిన స్థలం, భూ బదలాయింపు దస్తావేజుల్లో కూడా సీఎం జగన్ ఫోటోలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే ఇంటి పట్టాల్లో పెద్దసైజు ఫోటోలను బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించేలా ముద్రించారు. దీనికితోడు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దస్తావేజుల్లో కూడా అదేవిధంగా జగన్ ఫోటోలను ముద్రించారు. భూ బదలాయింపు దరఖాస్తులు మూడు పేజీలు ఉండగా మూడు పేజీల్లోనూ జగన్ ఫోటోలను పెద్దగా ముద్రించడం గమనార్హం.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా : టీడీపీ



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని, కనీసం చనిపోయిన వారి పేర్లు కూడా తొలగించలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు విమర్శించారు. ఈమేరకు సోమవారం పలువురు స్థానిక టీడీపీ నేతలు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఏళ్ల తరబడి నివాసంలేని వారి ఓట్లు సైతం జాబితాలో తొలగించ లేదన్నారు. జీరో డోర్ నెంబర్లతో చాలా ఓట్లు నమోదై ఉన్నాయన్నారు. ఒకే కుటుంబాల్లోని ఓట్లు సైతం వేర్వేరు వార్డుల్లో ఉన్నాయని, అధికారులు స్పందించి ఓటర్ల జాబితాను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఖాదర్‌బాష, టీడీపీ నేతలు చెరుకూరు తిరుపతినాయుడు, సిహెచ్ నరేష్, పి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఇవ్వాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల వ్యవసాయ రంగానికి ఏడు గంటల విద్యుత్ సరఫరా మాత్రమే ఇస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడు గంటల విద్యుత్ సరఫరాలో సైతం అంతరాయాలు ఏర్పడుతుండడంతో ప్రస్తుతం సాగు చేసిన, కోత దశలో ఉన్న పంటలు వాడు దశకు చేరుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా ఇవ్వాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న ప్రతినిధులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 12: మండలంలోని గణేశ్వరాపురంలో సోమవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, టీడీపీ నియోజకవర్గ నాయకుడు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న గ్రామంలోని 124 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలంలో రామాలయం నిర్మించొద్దు

● అధికారుల హెచ్చరిక



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మర్రిపాడు, ఫిబ్రవరి 12: ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రామాలయ నిర్మాణం చాబోలులో అధికారులకు తలనొప్పిగా మారింది. చాబోలు ఎస్సీ కాలనీలో వున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని శిథిలావస్థకు చేరిందనే నెపంతో దసరల సెలవుల సమయంలో నేతలు కూల్చి, భూమిని చదును చేశారు. అక్కడ చదువుతున్న విద్యార్థులకు మెయిన్ పాఠశాలలో ఉన్న అదనపు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా, చదును చేసిన ప్రాంతంలో రామాలయం నిర్మించాలని నేతలు తలపెట్టారు. సమాచారం తెలుసుకొన్న మండల విద్యాశాఖాధికారులు నజీర్ బాషా, ధనలక్ష్మి ఎంపీడీవో మనోహర్‌రాజ్‌తో కలిసి ఆప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, తమకు తెలియకుండా ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్థానిక నేతలను హెచ్చరించారు.

ప్రతిభా పరీక్షలో విజేతలకు అభినందనలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వింజమూరు, ఫిబ్రవరి 12: ఇటీవల అపస్, యూటీఎఫ్ నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వతరగతి విద్యార్థులు ప్రతిభను చాటి విజేతలుగా నిలిచారు. ఆ విద్యార్థులను సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ మాల కొండయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. సోమవారం మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మిక సంఘాలతో ఒప్పందం చేసుకున్న అంశాలను జీవో జారీచేయకుండా కాలయాపన చేస్తోందని మున్సిపల్ కార్మిక సంఘం (ఏఐటీయుసీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, పట్టణ కార్యదర్శి బి హజరత్తయ్య విమర్శించారు. సోమవారం మున్సిపల్ కార్మికులతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ ఈవీ ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక డీఈ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అవగాహన కల్పించి వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయో నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం హర్షవర్థన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం



చేజర్ల కండ్రిక రోడ్డులో కూరుకుపోయిన లారీ

చేజర్ల : భారీ వాహనాల కారణంగా మండలంలోని చేజర్లవారి కండ్రిక రహదారి ధ్వంసం అవుతోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీ సప్పట వద్ద కుంగిపోవడంతో గ్రామస్థులు అక్కడకు చేరుకుని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని, రహదారిని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం..

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల వసతిగృహంలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టీ గోపికృష్ణ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల కళాశాలలో చదివే విద్యార్థులు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురయ్యారనే విషయం అవాస్తమన్నారు. కొంతమంది విద్యార్థులు సాధారణ అనారోగ్య కారణాల వల్ల అస్వస్థతకు గురై చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారన్నారు. ఒకరిద్దరు విద్యార్థులు బయట తిన్న ఆహారం కారణంగా అస్వస్థతకు గురయ్యాయన్నారు. మేకపాటి కుటుంబీకుల ఆధ్వర్యంలో కళాశాల నడుస్తుందని చెప్పడం వాస్తవం కాదని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్ హేమలత, వార్డెన్ వై బాలచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 12: మండలంలో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల లబ్ధిదారులకు ఈకేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సోమవారం పేర్కొన్నారు. మండలంలో 5,784 ఆయుష్మాన్ భారత్, 6,890 ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ జరిగిందన్నారు. లబ్ధిదారులందరికీ సచివాలయ సిబ్బంది రెండు రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయాలని ఆమె సూచించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సంక్షేమ పథకాలు కొనసాగుతాయి!

కావలి,ఫిబ్రవరి12: టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలకు కోత వేస్తారని వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పాత పథకాలను కొనసాగిస్తూ సూపర్ సిక్స్ పథకాలను అందచేస్తారన్నారు. కావలి ముసునూరులోని ఆయన నివాసంలో సోమవారం పలుగ్రామాలకు చెందిన వైసీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి కావ్య పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. కావలి రూరల్ మండలం పూలదొరువుకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే రుద్రకోటకు చెందిన పలువురు నేతలు ముక్కు గోపాల్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కావలి ఏఎంసీ చైర్మన్ సన్నెబోయిన ప్రసాద్ స్వగ్రామమైన చెన్నాయపాలెం నుంచి పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సర్వాయపాలెంకు చెందిన బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరులతో టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన పూలదొరువు వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వైభవంగా గంగమ్మ, మహాలక్ష్మమ్మల తిరునాళ్ల



గ్రామోత్సవంలో గంగమ్మ

అల్లూరు, ఫిబ్రవరి 12 : అల్లూరుపేట సత్రంలో వెలసి ఉన్న గంగమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల గ్రామోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆది, సోమవారాల్లో అమ్మవార్ల తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ముందుగా పోతురాజుకు చల్ది నైవేద్యం అనంతరం అమ్మవార్లకు పొంగళ్లు పొంగించారు. గంగమ్మ గ్రామోత్సవంలో గంగపెట్టె, వీరతాళ్లు, మహాలక్ష్మమ్మ గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బాణసంచా వెలుగులు, తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా కోలాటాలు, నృత్యాలు భక్తులను అలరించాయి. అమ్మవార్లను కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కందుకూరు, ఫిబ్రవరి 12: మాఘ పౌర్ణమి సందర్భంగా కందుకూరు నుంచి ఈనెల 22న అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం పెద్దన్నశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భోజన వసతితో కలుపుకుని టికెట్ ధర రూ. 2,600గా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనివేటి మండపానికి విరాళం



విరాళం అందచేస్తున్న దాతలు

కందుకూరు, ఫిబ్రవరి 12: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన అనివేటి మండపం నిర్మాణం కోసం సోమవారం గాలి కామేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి ఇందిరాదేవి, కుమారులు గాలి వెంకటరామకృష్ణ-సుగుణ దంపతులు, గాలి వెంకటరమణకుమార్- శారద దంపతులు రూ. 50,001లు విరాళం ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మంచి రాజు మురళీమోహన్‌కు ఈ మొత్తాన్ని వారు అందజేశారు.

కలిగిరి ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



రంగ సుబ్బరాయుడు

కలిగిరి, ఫిబ్రవరి 12: ఎంపీడీవోగా ఎం. రంగ సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు పోలింగ్ బూత్‌ల నిర్వహణ, వసతుల కల్పనలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈవీఎంలపై అవగాహన కల్పిస్తాం..

అల్లూరు : రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర అన్నారు. సోమవారం అల్లూరు ఎంపీడీవో కార్యాలయానికి రెండు ఈవీఎంలు చేరుకున్నాయి. ఆయన వాటిని పరిశీలించి మాట్లాడారు. బూత్ లెవల్ అధికారుల ద్వారా వీటిని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉంచి, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీ మృతికి సంతాపం

కావలిటౌన్ : ప్రభుత్వ ఖాజీ సయూద్ మౌలానా (37) మృతికి పలువురు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. సోమవారం సాయంత్రం కావలిలో అంత్యక్రియలు నిర్వహించారు.ఆయన మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. జిల్లా నుంచే కాక చైన్నై, హైదరాబాద్, బెంగళూరు నుంచి పలువురు మైనారిటీ ప్రముఖులు, మత గురువులు తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేత కావ్య కృష్ణారెడ్డి, మైనార్టీ నేత సప్తార్ కిర్మాణి, కుందుర్తి కామయ్య తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

సెంటిమెంట్‌తో వైసీపీ నేత ప్రచారం

జలదంకి : ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం మండలంలోని జమ్మలపాలెంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గ ఈశాన్యం వైపు నుంచి సెంటిమెంట్‌తో రాజారెడ్డి జమ్మలపాలెం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, ఎంపీపీలు, పలువురు సర్పంచులు, పార్టీ ఎన్నికల పరిశీలకుడు ధనుంజయరెడ్డి, నాయకులు పాలవల్లి మాలకొండారెడ్డి, కేతిరెడ్డి రవిరెడ్డి, సర్పంచి బుర్రి శ్రీవేణి, కేతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, మాధవ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు మున్సిపల్ కార్మికుల నిరసన



మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కావలి, ఫిబ్రవరి12: సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పట్టణంలోని నాలుగు డివిజన్లలోని మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మెకాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు విడుదల చేసిన జీవోలను అమలు చేయాలన్నారు. మిగిలిన హామీల జీవోలను విడుదల చేయాలని వారు కోరారు. హామీలు అమలయ్యే వరకు దశల వారీగా ఆందోళన చేపడతా మన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, గుంజి కిషోర్, ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, వై. రవి, గుంజి అంకయ్య, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం పోటీ చేయమంటే ఆలోచిస్తా : బీఎమ్మార్



కావలి, ఫిబ్రవరి12: రానున్న ఎన్నికల్లో కావలి నుంచి పోటీ చేయాలని అధిష్ఠానం ఆదేశిస్తే అప్పుడు ఆలోచిస్తానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం కావలి మినీస్టేడియంలో వాకింగ్‌కు వచ్చిన ఆయన అక్కడున్న విలేకరులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. 2028 వరకు తనకు రాజ్యసభ పదవీకాలం ఉందని, కావలిలో పోటీకి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నందున ఇక్కడ అభ్యర్థి అవసరంలేదన్నారు. మరో మూడు నెలల పాటు కావలిని వదిలిపెట్టిపోనని చెప్పారు. కాగా టీడీపీలో ఉన్నప్పుడు అనుచరులుగా కొనసాగినవారిని తన స్వగృహంలో పార్టీ కండువాలు కప్పి వైసీపీలో చేర్చుకున్నారు. కాగా మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని వాకర్లు కోరగా, స్పందించిన బీద ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు అందచేస్తానన్నారు. దశలవారీగా స్టేడియం అభివృద్ధికి కృషిచేస్తానని బీద పేర్కొన్నారు.

నీటి విడుదలకు వినతి



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి12: సంగం బ్యారేజీ వద్ద కావలి కాలువకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఆర్డీవోను కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఆర్డీవో కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ కావలి కాలువ మీదున్న మోటార్లను 10రోజుల్లో ఐదు రోజులపాటు ఆపగలిగితే చివరి ఆయకట్టును కాపాడుకోవచ్చన్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో సంఘం నేతలు రావి మాల్యాద్రి, పేముల సీతారామయ్య, గడ్డం మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడిగా పువ్వాడి



కావలిటౌన్, ఫిబ్రవరి12: కావలి మండలం రామచంద్రాపురం ఎంపీయూపీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్రకౌన్సిల్ సమావేశాల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంజుల, కె భానుమూర్తి, జిల్లా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ సుశీలకు బెస్ట్ ఉమన్ సైంటిస్టు అవార్డు



ప్రిన్సిపాల్ నుంచి అవార్డు అందుకుంటున్న సుశీల

కావలి,ఫిబ్రవరి12: స్థానిక వీఎస్‌యూ జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ మీసాల సుశీలను నావల్ రీసెర్చ్ అకాడమీ వారు బెస్ట్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం వీఎస్‌యూలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అవార్డును అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీ. శైలజ, డాక్టర్ పీ. గోపిక్రిష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు అభినందనీయం

బిట్రగుంట, ఫిబ్రవరి 12: ఏళ్ల తరబడి వీధిదీపాలకు నోచుకోని అక్కరాజువారికండ్రిక అరుంధతీవాడకు బోగోలు మాజీ సర్పంచి బోగిరి మణెమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త బోగిరి. యోహాను వీధి దీపాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నేత వీరరఘు, ఎమ్మార్పీఎస్ నేత జయ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిమడుడు పీహెచ్‌సీ తనిఖీలు

బిట్రగుంట, ఫిబ్రవరి 12: బోగోలు మండలం అల్లిమడుగు పీహెచ్‌సీని సోమవారం అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, కోవూరుపల్లి వైద్యులు నిత్యప్రశాంతి, సూపర్‌వైజర్ వసంత తదితరులు ఉన్నారు.

కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించండి



ఓ వైపు పెద్ద గుంత, మరో వైపు రక్షణ గోడ లేని కల్వర్టు

లింగసముద్రం, ఫిబ్రవరి 12 : మండలంలోని పెంట్రాలలోని తాతాహోటల్ సెంటర్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు కల్వర్టుకు రెండువైపులా రక్షణ గోడలు లేవు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్రఆందోళన చెందుతున్నారు.ఈ విషయాన్ని చాలాకాలం నుంచి అధికారుల దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కల్వర్టుకు తూర్పు వైపున పెద్ద గుంత ఉంది. ఈ గుంతను గమనించకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది.పడమర వైపున ఉన్న రోడ్డు మార్జిన్‌ను పక్కనే ఉన్న ఇంటి యజమాని ఆక్రమించాడు. దీంతో రోడ్డు కుచించుకొని పోయింది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఎస్ఐ మృతికి సంతాపం

వింజమూరు, ఫిబ్రవరి 12 : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వై సుబ్రహ్మణ్యం సోమవారం మృతిచెందారు. గత కొద్దిరోజులుగా ఏఎస్ఐ అస్వస్థతకు గురై కావలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సుబ్రహ్మణ్యం మృతికి స్థానిక ఎస్ఐ సీహెచ్ కోటిరెడ్డి, సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పారిశుధ్య లోపంతో వ్యాధుల భయం

వలేటివారిపాలెం : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు లేకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు వ్యాప్తి చెందాక మొక్కుబడిగా పారిశుధ్య చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడంలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని కూనిపాలెం, పోకూరు, వలేటివారిపాలెం, రోళ్లపాడు, పోకూరు, శింగమనేనిపల్లె శాఖవరం, బంగారక్కపాలెం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. మురుగు పోయేందుకు కాలువలు లేకపోవడంతో వానాకాలం వస్తే మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కాలువలు ఉన్న చోట చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు,పేడ దిబ్బలు ఉండడంతో రోడ్లపైకి మురుగునీరు ప్రవహిస్తున్నది. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలి.

సీఎం నిర్ణయించే అభ్యర్థినే ఎంపీగా గెలిపించండి!

● కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 12 : "కోవూరు ఎమ్మెల్యేగా నన్ను, నెల్లూరు ఎంపీగా సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎవరిని నిర్ణయిస్తే వారిని గెలిపించాలి." అంటూ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల బుచ్చిలో ఓ మంచినీటి పథకం శంకుస్థాపనలో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలన్న ఆయన ఇప్పుడు విరుద్ధంగా మాట్లాడటంతో శ్రేణుల్లో అయోమయం నెలకొంది. సోమవారం బుచ్చి టోల్‌ప్లాజా వద్ద ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 'నేను మిమ్మల్నే నమ్ముకున్నాను. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళల ఆశీర్వాదాలు నాకు ఉండగా ఎవరూ నన్నేం చేయలేరు.' అంటూ వ్యాఖ్యానించారు.

● చిన్నారులకు ఆర్థిక సాయం

బుచ్చి మండలంలోని దామరమడుగు దళితవాడలో తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు సోమవారం ఆర్థిక సాయం అందచేశారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు నుంచి ఒక్కొక్కరి రూ.20వేల వంతున పంపిణీ చేశారు. అనూషాకు రూ.20వేలు, అద్విక్‌కు రూ.20వేలను బ్యాంకులో డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు బాండ్లు అందజేశారు. వారికి 18 ఏళ్ల నిండాక నగదు తీసుకోవచ్చని ట్రస్టు సభ్యులు తెలిపారు.

కోడిపందేల జోరు

కొడవలూరు ఫిబ్రవరి 12 : మండలంలో జోరుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. షామియానాలు వేసి జూదరులను రప్పించి పందేలు వేస్తున్నారు. మండలంలో తలమంచి ఫైడేరు కాలువపైన, రేగడి చెలిక, కొత్తవంగల్లు గ్రామ సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో ఇవి జరుగుతున్నాయి. రాత్రింబవళ్లు తేడా లేకుండా పందేలు నిర్వహిస్తున్నారు. ఈ పందేలు జరిగే ప్రదేశంలో పేకాట కూడా సాగుతోంది. అధికారులు ఈ స్థావరాలపై దాడులు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

ముత్తుకూరు, ఫిబ్రవరి 12 : పైనంపురం, మునునూరువారిపాలెంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, బాబిరెడ్డి, సుధీర్, లక్ష్మణ్‌రెడ్డి, శివప్రసాద్, చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

కక్షపూరిత రాజకీయాలు సరికాదు

వెంకటాచలం, ఫిబ్రవరి 12 : వైసీపీ నాయకులు దళితులపై కక్షపూరిత రాజకీయాలు చేయడం సరికాదని టీడీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు దాసి చక్రధర్ హితవు పలికారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో సోమవారం ఎస్సీ నాయకులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇటీవల మాజీ మంత్రి సోమిరెడ్డి పుంజులూరుపాడులో పర్యటించిన సమయంలో ఒక దళిత మహిళ వచ్చి హారతి ఇచ్చిందని, ఆ మరొసటి రోజే స్థానిక వైసీపీ నాయకులు కక్షపూరిత చర్యల్లో భాగంగా ఆ దళిత మహిళ అంగడిని పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులిచ్చి పోలీసుల సహకారంతో బలవంతంగా తొలగించారని, రాబోవు ఎన్నికల్లో వైసీపీకి దళితులే ఓటుతో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. దళితులందరూ ఏకమై సోమిరెడ్డికి ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా కార్యదర్శి యాకల రవి, టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి, నాయకులు హనుమంతు తదితరులున్నారు.

వైద్యాధికారి తీరుపై ఏఎన్ఎంల అసహనం

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 12 : వరిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి దామవరపు నరసింహారావు తీరుపై ఏఎన్ఎంలు, నర్సులు అసహనం వ్యక్తంచేస్తూ తాము విధులు నిర్వహించలేమని వైద్యాధికారి రాధికకు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఏఎన్ఎంలు మాట్లాడుతూ డాక్టర్ నరసింహారావు అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా తమకు ఫోన్లు చేసి దుర్భాషలాడుతున్నారని, మహిళలనే కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యాధికారి తీరుపై సమగ్ర విచారణ చేపట్టి తమ ఆత్మ గౌరవానికి భంగం వాటిల్లకుండా చూడాలని 22 మంది ఏఎన్ఎంలు కోరారు.

సర్వేపల్లి నియోజకవర్గ బీసీ అధ్యక్షుడిగా నిమ్మల

సర్వేపల్లి నియోజకవర్గ బీసీ అధ్యక్షుడిగా నిమ్మల రమేష్‌గౌడ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి సోమవారం నియామక పత్రం అందించారు. రమేష్ మాట్లాడుతూ బీసీల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. త్వరలో టీపీ గూడూరుకు నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మనుబోలు, ఫిబ్రవరి 12: మనుబోలులోని 10 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ చిరంజీవి సోమవారం పరిశీలించారు. వాటిలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ సజావుగా జరగడానికి కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆయన వెంట వీఆర్‌వో నాగార్జున్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అప్పుల ఆంధ్ర జగన్ ఘనతే : కురుగొండ్ల

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 12 : అడ్డూ అదుపూ లేని అవినీతికి పాల్పడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడని మాజీ ఎమ్మెల్యే, వెంకటగిరి టీడీపీ ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. రాపూరులో అనారోగ్యంతో బాధపడుతున్న మైనార్టీ సెల్ నాయకుడు ముక్తార్‌ను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఓ వైపు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, మరోవైపు నారా లోకేశ్ నిర్వహిస్తున్న సభలకు వస్తున్న జనాన్ని చూసి వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలకు వెన్నులో వణుకు మొదలైందన్నారు. మళ్లీ జగన్‌కు ఓటు వేస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తాడని, వెంకటగిరిలో స్థానికేతరులకు ఓటు వేస్తే వెంకటగిరిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తారని, స్థానికుడైన తనను ఆదరిస్తే ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, నువ్వుల శివరామకృష్ణ, కోండ్లపూడి రాఘవరెడ్డి, ఏడోటి కోటేశ్వరనాయుడు, ఖాజా మోహిద్దాన్, డాక్టర్ వేణుగోపాల్, పరందామరెడ్డి, పాపయ్య, సాయి, గౌస్ పాల్గొన్నారు.



సైదాపురం : మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

చంద్రబాబు సీఎం కావడం ఖాయం

సైదాపురం, ఫిబ్రవరి 12: రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి, నేను ఎమ్మెల్యే అవడం ఖాయమని కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని కలిచేడులో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వడ్డిపాళెం అంజనేయస్వామి గుడిలో పూజలు చేశారు. ఎన్నికల ప్రచారం ఇక్కడి నుంచే ప్రారంభించడం ఆనవాయితీ అన్నారు. ఇంటింటికీ వెళ్ళి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, టీడీపీ మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే అయిన వెంటనే ఇనాం భూములకు పట్టాలు ఇప్పించడం జరగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, పెమ్మసాని దిలీప్ చౌదరి, తొండాపు విజయ్ శంకర్ నాయుడు, నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, వరదబండి వెంకటేశ్వర్లురెడ్డి, రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి ఆశయ సాధనకు కృషి : దినేష్

విడవలూరు, ఫిబ్రవరి 12: ప్రజల కోసం పోరాటాలు చేసిన మాజీ ఎమ్మెల్యే పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు టీడీపీ కృషి చేస్తుందని కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం అలగానిపాడులో ఆయన పాదయాత్ర చేపట్టారు. స్థానిక నేత కొపర్తి హరనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దినేష్‌రెడ్డి కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ హయాంలో అలగానిపాడులో సీసీరోడ్లు, వాటర్ ట్యాంకు, తాగునీటి కుళాయిలను వేశామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చేనేత, గౌడ, ఎస్సీ, ఎస్టీలకు సముచిత న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెముకుల కృష్ణ చైతన్య, మాతూరు శ్రీనివాసులురెడ్డి, చెముకుల శ్రీనివాసులు, తాతా బాలకృష్ణ, ఆవుల రవిచంద్ర, దూది విజయరాఘవన్, అనండగుండ వెంకటరమణయ్య పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న దినేష్‌రెడ్డి

వైసీపీకి కైలాసం దంపతుల రాజీనామా

త్వరలో టీడీపీలో చేరిక

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 12 : ఇందుకూరుపేట మాజీ జడ్పీటీసీ సభ్యుడు, రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన మాజీ జడ్పీటీసీ కైలాసం ఆదిశేషారెడ్డి, ఆయన భార్య, మాజీ ఎంపీపీ కైలాసం రేణుక సోమవారం వైసీపీకి రాజీనామా చేశారు. వీరిద్దరూ త్వరలో టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. ఆదిశేషారెడ్డి 1995 నుంచి 2000 వరకు ఇందుకూరుపేట ఎంపీపీగా, 2001 నుంచి 2006 వరకు జడ్పీటీసీగా పనిచేశారు. ఆయన సతీమణి కైలాసం రేణుక 2014 నుంచి 2019 వరకు ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. వైసీపీ విధానాలపై అసంతృప్తితో ఉన్న వీరు త్వరలో తమ అనుచరులతో టీడీపీలో చేరనున్నారని తెలిసింది. కైలాసం దంపతుల రాజీనామాతో మండలంలో వైసీపీ ప్రాబల్యం తగ్గినట్లు అయింది.

కాకాణి ధన దాహం వల్లే కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ తరలింపు

ముత్తుకూరు, ఫిబ్రవరి 12 : వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధన దాహం వల్లే కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ తరలిపోతోందని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. ముత్తుకూరులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటైనర్ టెర్మినల్ కోసం పోరాటం చేసేందుకు అఖిలపక్షం సిద్ధంగా ఉందన్నారు. సర్వేపల్లిలో టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాధాకృష్ణమనాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జున్‌యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివసులు, నాయకులు ఏడుకొండలు, కోదండయ్య, రమేష్, రమణయ్య, శంకర్, శోభన్, షఫీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి : డీఈ

మనుబోలు, ఫిబ్రవరి 12: గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం జలజీవన్ మిషన్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైను, ఇంటింటికీ కొళాయి తదితర పనులు కమిటీ ఆమోదంతోనే చేయాలన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ సిస్టం ద్వారా జలజీవన్ మిషన్ పనులు జరుగుతాయన్నారు. మండలంలో ఎనిమిది గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో జలజీవన్ మిషన్ కోఆర్డినేటర్ శర్మ, ఎంపీడీవో ప్రసాద్, ఏపీఎం వనజాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి, ఈవోపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఓటమి భయంతో వైసీపీ చీప్ ట్రిక్స్

● రాజకీయ కోణంతోనే నారాయణ వైద్య కళాశాలపై దాడులు

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 12: ఓటమి భయంతోనే వైసీపీ నేతలు చీప్‌ట్రిక్స్‌కు పాల్పడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని 11వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుని వచ్చే ఎన్నికల్లో పొంగూరు నారాయణకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కోణంలోనే నారాయణ వైద్య కళాశాలపై ప్రభుత్వం దాడులు చేయించిందని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా నారాయణ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలలో వైసీపీకి డిపాజిట్ కూడా రాదని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే నగర అభివృద్ధి జరిగిందని, వైసీపీ పాలనలలో చేసింది శూన్యమన్నారు. నెల్లూరు నగరంలో అండర్ గ్రౌండ్ నిర్మాణం పూర్తి కావాలన్నా, దోమల బాధ నుంచి విముక్తి లభించాలన్నా టీడీపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థి నారాయణను గెలిపించాలని ఆయన కోరారు. తద్వారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు జి.నాగేంద్ర, చికోలు నారాయణ, సునీల్ రెడ్డి, రాంకి, మొహిద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

టీడీపీలో చేరిన వైసీపీ కార్పొరేటర్ కిన్నెర

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12: నగరంలోని 7వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి కుటుంబ సభ్యులతో సహా సోమవారం మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ, కిన్నెర మాల్యాద్రి కుటుంబసభ్యులు, మిత్రబృందం పాల్గొన్నారు.



చంద్రబాబు నాయుడుతో కిన్నెర మాల్యాద్రి

విజన్ లేని నాయకుడు జగన్ : నారాయణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 12 : రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విజన్ లేని నాయకుడు ముఖ్యమంత్రి జగన్ అని మాజీ మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరంలోని 7వ డివిజన్ పరిధిలోని నవాబుపేట, జలకన్యబొమ్మ ప్రాంతాల్లో సోమవారం ఆయన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక టీడీపీ నాయకులతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించే పథకాలను వివరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా నిరుద్యోగులను దగా చేసిన నేతగా జగన్ నిలిచారన్నారు. రాష్ట్రంలో ఒక పరిశ్రమను తీసుకురాక పోగా ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే నిరుద్యోగులకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న మాజీ మంత్రి నారాయణ

చట్ట సభల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 12 : చట్ట సభల్లో అడుగు పెట్టేందుకు రాజకీయ పార్టీలు బీసీలకు అవకాశం కల్పించాలని జిల్లా బీసీ కులాల బహుజన ఐక్య వేదిక అధ్యక్షుడు కిన్నెర మాలకొండయ్య కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో బీసీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సంప్రదాయ వృత్తి చేసుకునే నాయీబ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు, రజకులు వంటి బీసీ కులాలకు ఏ రాజకీయ పార్టీ చట్ట సభలో కూర్చొనే అవకాశం కల్పించలేదన్నారు. రానున్న ఎన్నికల్లో కుల వృత్తులు చేసుకునే బీసీ వర్గాలకు పార్టీ ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పీ.మదన్, సుబ్రహ్మణ్యం ఆచారి, షేక్.జిలానీ, కె.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి : చేవూరు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ పాలనలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 18వ డివిజన్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్, ప్రధాన కార్యదర్శులు నట్రంబాక మోహన్‌రెడ్డి, అరవదాసు, జలీల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవకుమార్‌రెడ్డి

స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 12 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్లు-స్టాంపుల శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు నగరంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న ఆ కార్యాలయాన్ని తాజాగా నగరంలోని రేబాల వీధిలోని ప్రభుత్వ భవనంలోకి మార్చారు. ఈ కార్యాలయాన్ని ప్రారంభించిన డీఐజీ కిరణ్‌కుమార్, ఆ కార్యాలయంలోనే రిజిస్ట్రార్ బాలాంజనేయులు, సబ్ రిజిస్ట్రార్‌తో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ రిజిస్ట్రార్ హరివర్మ, అజయ్, హరి, డాక్యుమెంటు రైటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన డీఐజీ కిరణ్‌కుమార్

పాలక మండలికి ముగిసిన గడువు

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 12 : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మణ్ణి ఆలయ ధర్మకర్తల రెండేళ్ల పదవీకాలం ముగిసింది. దీంతో సోమవారం రాత్రి వారికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలక మండలి సభ్యులు తమ పదవీకాలంలో ఆలయం అభివృద్ధికి చేసిన పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ధర్మకర్తలను ఆలయ ప్రధాన అర్చకులు ఎక్స్‌ఫిషియో సభ్యులు, వేద పండితులు అర్చకులు ఆశీర్వదించారు. ఈ అభినందన సభలో వైసీపీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, ఆలయ సహాయ కమిషనర్ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డిలు వారి సేవలను అభినందించారు. పదవీ విరమణ చేసిన ధర్మకర్తలు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన అవసరం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 12 : మూర్ఛ వ్యాధి (ఎపిలెప్సీ)పై ప్రజలకు అవగాహన లేకపోవడంతో జిల్లాలో ఈ వ్యాధి చాప కింద నీరులా వ్యాపిస్తోందని నారాయణ ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ డాక్టర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నారాయణ ఆసుపత్రిలో నిర్వహించిన ప్రపంచ మూర్ఛవ్యాధి దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, న్యూరాలజిస్ట్ డాక్టర్ అనూష, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ సునంద, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుకోండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 12 : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు అందుకోవాలని బీజేపీ అనుబంధ మోర్చాల రాష్ట్ర ఇన్‌చార్జి పీ.సురేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని 10, 11 డివిజన్‌లలో బీసీకేసీ కల్యాణ మండపం ఆవరణలో ఉన్న సచివాలయంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్‌బ్యాంక్ కోఆర్డినేటర్ రవిశంకర్, నోడల్ అధికారి ప్రదీప్‌కుమార్, బీజేపీ నాయకులు హర్షవర్ధన్, సీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్న నేతలు

కాపులు - బలిజల సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 12 : ఓట్లు కోసం కాపులు, బలిజలు, తెలగల వద్దకు వస్తున్న రాజకీయ పార్టీలు వారి అభివృద్ధికి, సంక్షేమానికి, రాజకీయ ఎదుగుదలకు ఏమి చేశారో శ్వేతపత్రం విడుదల చేసి ఓట్లు అడగాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జర్నలిస్టు భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ జనాభాలో, ఓటర్లలో అధికంగా ఉన్న కాపు, బలిజ, తెలగలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాల ఏర్పాటుకు అడ్డంకిలేదని, రాయలవారి విగ్రహాలు ఏర్పాటుకు ఆంక్షలు విధిస్తున్నారన్నారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతిలను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని తెలిపారు. రాయలసీమ కాపు తెలగ బలిజ సంఘం అధ్యక్షుడు శ్రీహరి రాయల్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ బలపరిచిన పార్టీకే బలిజలు ఓటు వేయాలని కోరారు. నెల్లూరులో బలిజ నాయకుడు పొంగూరు నారాయణపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వేధింపులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.వేణుగోపాల్, హేమంత్‌కుమార్ రాయల్, పూల హేమంత్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, సరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వినతులెందుకు పునరావృతం అవుతున్నాయి? : ఏడీసీ



అర్జీలు పరిశీలిస్తున్న ఏడీసీ శర్మద

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 12 : ఒక్కసారి అధికారులకు అందిన వినతులు మళ్లీ, మళ్లీ ఎందుకు పునరావృతమవుతున్నాయి.. అని ఎన్ఎంసీ ఏడీసీ శర్మద అధికారులను ప్రశ్నించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఆమె నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీకరించిన సమస్యలకు సంబంధించిన వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అక్కడికక్కడే పరిష్కారం చూపాలన్నారు. ఇందులో ఎలాంటి జాప్యం జరగడానికి వీలు లేదని స్పష్టం చేశారు. శాశ్వత పరిష్కారాలు చూపే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాలకు సంబంధించి 26 మంది తమ సమస్యలను అర్జీలు అందజేశారు.

ఏఎస్ఐ మృతికి సంతాపం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12: వింజమూరు ఏఎస్ఐ వై సుబ్రహ్మణ్యం మృతికి ఏపీ పోలీసు అధికారుల సంఘం నాయకులు సంతాపం తెలిపారు. కావలి పట్టణంలోని వాయునందన ప్రెస్ వీధిలోని ఆయన నివాసంలో సుబ్రహ్మణ్యం మృతదేహాన్ని ఏపీ పోలీసు అధికారుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు వై శ్రీహరి, కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ, కలిగిరి ఇన్‌స్పెక్టర్ ఎండీ ఫిరోజ్, విజమూరు ఎస్ఐ కోటిరెడ్డి, పలువురు పోలీసు సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు పరామర్శించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 12 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంవో నుంచి సోమవారం వచ్చిన పిలుపు మేరకు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి మాట్లాడారు. పలు రాజకీయ అంశాలపై చర్చించిన అనంతరం రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ సంక్షేమాలను ప్రజలకు వివరిస్తూ జిల్లాలో సమన్వయంగా పని చేయా లని సీఎం సూచించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.



సీఎం జగన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 12 : నెల్లూరురూరల్‌లోని రెవెన్యూ అధికారులు ప్రజా సమస్యలపై కనీసం స్పందించడం లేదని మండలంలోని వెల్లంటికి చెందిన రైతులు కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్పందనలో భాగంగా కలెక్టరేట్‌కు వచ్చిన వారు వినతులు అందచేశారు. అనంతరం మాట్లాడుతూ వెల్లంటిలో రీ సర్వే నిర్వహిస్తే ఆద్యాంతం తప్పులతడకగా ప్రక్రియ ముగించారన్నారు. లబ్ధిదారులు పేర్లు, సర్వే నెంబర్లు మార్పులతో జాబితా సిద్ధం చేశారని, తద్వారా రైతులకు కొత్తకష్టాలు ఎదురయ్యాయన్నారు. రేషన్ బియ్యం అర్హులకు అందడం లేదని ఫిర్యాదులు చేసినా తహసీల్దారు, గ్రామ వీఆర్వో కనీసం పట్టించుకోవడం లేదని తెలిపారు. రీ సర్వేలో వాస్తవ విస్తీర్ణం తగ్గించారని, దీనిని సరిచేయాలని తిరుగుతున్నా ఫలితం లేదన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200

జాగ్రత్తగా లేకుంటే జేబుకి చిల్లే

● ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన

పొదలకూరు, ఫిబ్రవరి 12: జాగ్రత్తగా లేకుంటే జేబుకు చిల్లిపడుతుందని, గ్రామీణులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ట్రీస్ సేవా సంస్థ ప్రెసిడెంట్ షేక్ నౌరాజ్ సూచించారు. మండలంలోని అమ్మవారిపాలెం ఎస్సీ కాలనీలో ఆర్బీఐ వారి సౌజన్యంతో పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత - సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. పలురకాల బ్యాంకు పథకాలు, సేవలపై అవగాహన కల్పిస్తూ గోడపత్రికలు ప్రదర్శించారు. తాటిపర్తి (జీసీ) స్కూల్ అమ్మవారి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేష్, ప్రభగిరిపట్నం హెచ్ఎం వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. ఉపాధ్యాయిని జ్యోతి సుబ్బారావు ఆధ్వర్యంలో చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా, అమ్మవారిపాలెం జడ్పీ స్కూల్ పీడీ సురేంద్రబాబు, ట్రీస్ సేవా సంస్థ కార్యదర్శి అహ్మద్, హైదరాబాద్ ఆర్బీఐ మేనేజర్ ఓంకార్, ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ గయాజ్, రిసోర్స్ పర్సన్స్ టి వెంకటేశ్వర్లు, ఏ చంద్రశేఖర్, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రీస్ ప్రెసిడెంట్ నౌరాజ్

అటవీ భూమిలో అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలి

● కలెక్టర్‌కి గ్రామస్థుల ఫిర్యాదు

పొదలకూరు, ఫిబ్రవరి 12: మండలంలోని మొగళ్లూరులో అటవీ భూమిలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ రైతు సంఘం నాయకులు కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, వెన్నెపూస రాజశేఖర్‌రెడ్డి కలెక్టర్ హరినారాయణన్‌ను కోరారు. ఈమేరకు సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో వినతిప్రతం అందించారు. మొగళ్లూరులో సుమారు వెయ్యి ఎకరాల్లోని అటవీ భూమిలో 15 రోజుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు అక్రమ మైనింగ్ చేపట్టారు. 24గంటలు యంత్రాలతో పనులు చేస్తూ తెల్లరాయిని వెలికితీసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఫిర్యాదు చేశారు. మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరధరామిరెడ్డి, చిన్న ఓబుల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

విజృంభిస్తున్న మంప్స్

● అల్లాడిపోతున్న పిల్లలు


వాచిన బాలుడి దవడ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తిలో గవదలమ్మ (మంప్స్) విజృంభిస్తోంది. వారం రోజుల నుంచి పిల్లల్లో అత్యధికంగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తుండడంతో పిల్లలు అల్లాడిపోతున్నారు. దవడలు వాచిపోవడం తోపాటు జ్వరం సోకుతుండడంతో నీరసించిపోతున్నారు.గవదలమ్మ పారామిక్సో వైరస్‌తో మొదలై తర్వాత చెవులకు దగ్గరగా ఉండే పరోటిడ్ గ్రంథిపై ప్రభావం చూపుతుంది. గవదల వాపు రావడం జరుగుతుంది. కొందరిలో సెంట్రల్ న్యూరల్స్ సిస్టం (మెదడు)పై ప్రభావం చూపి ప్రాణాం తంకంగా కూడా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ వైరస్ ఒకే గదిలో దగ్గరగా ఉన్నవారికి, అలాగే జలుబు, దగ్గు ఉన్నవారి నుంచి వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారం రోజుల తర్వాత లక్షణాలు బయటపడతాయి. వందలాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గాలి, వెలుతురు సక్రమంగా లేని తరగతి గదుల్లో చదువుకునే పిల్లలపై మంప్స్ ప్రభావం చూపు తోంది. వారం రోజుల నుంచి పిల్లలు గవదలు వాచిపోయి జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైరస్ సోకిన వారిని ఎవరితో కలవకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పాఠశాలల్లో ఈ జాగ్రత్తలు విధిగా పాటించాలి. సంబంధిత అధికారులు అవగాహన కల్పించడం తోపాటు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అప్రమత్తంగా వ్యవహరించాలి



పిల్లల్లో మంప్స్ వ్యాధిపై పెద్దలు అప్రమత్తంగా వ్యవహరించాలి. తీవ్ర సమస్యకు దారి తీసే ప్రమాదం ఉంటుంది కాబట్టి మొదటి దశలోనే గుర్తించి జాగ్రత్తలు పాటించాలి. సహజ పద్ధతిలో వేపాకు, పసుపు మిశ్రమాన్ని అద్దవచ్చు.ఇతర పిల్లలతో కలవకుండా చూసుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉంచాలి. శరీరం వైరస్ ప్రభావంతో నీరసంగా మారుతుంది కాబట్టి ఆరు రోజులు ద్రవ పదార్థాలను అధికంగా తాగించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల విషయంలో తప్పనిసరిగా వైద్యులనుసంప్రదించాలి.

- డాక్టర్ వెంకటరామన్, సీనియర్ చిన్న పిల్లల వైద్య నిపుణుడు



వామపక్షం.. తిరుపతిలో మాత్రం అధికారపక్షం

తిరుపతిలో దొంగ ఓటరు కార్డుల కుంభకోణం అంశంతో రాష్ట్రమంతా గగ్గోలుగా మారింది. ఐఏఎస్ అధికారి లాగిన్ నుంచే 34 వేల ఓటరు కార్డులు దొంగతనంగా డౌన్‌లోడ్‌చేసి నకిలీ కార్డులు సృష్టించిన వ్యవహారంలో ఐఏఎస్‌లు సస్పెండ్ అయ్యారు.ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. అధికారులు, ఉద్యోగుల మీద వేటు తర్వాత వేటు పడుతున్నాయి. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ,జనసేన పార్టీలు దొంగ ఓట్ల సూత్రధారులను పట్టుకుని చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన ప్రకటిస్తున్నాయి. ప్రజాస్వామిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమైన నేరం తిరుపతి కేంద్రంగా జరిగితే విచిత్రంగా వామపక్ష పార్టీలు మాత్రం పెదవి విప్పడం లేదు. అన్నింటిమీదా పిడికిలెత్తి, డప్పుకొట్టి గొంతువిప్పే సీపీఐ, సీపీఎం నాయకుల్లో ఒక్కరి గొంతుకూడా ఎందుకు పెగలడం లేదబ్బా అనే సందేహం నగరంలో చర్చగా మారింది. అట్లా అని ఈ రెండు పార్టీలూ అధికార వైసీపీకి మిత్రపక్షాలు కూడా కాదు. జగన్ తీరుపై భగ్గుమనే ఈ పార్టీలు తిరుపతి నగరంలో మాత్రం భిన్నవైఖరి ఎందుకు తీసుకున్నాయన్నదే ప్రజలను విస్తుపరుస్తున్న అంశం. ఆశా వర్కర్ల ఆందోళనలు, అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె, పారిశుధ్య కార్మికుల నిరసనలు,సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె.. ఇలా అన్నింటా తామై కనిపించిన తిరుపతి వామపక్ష నేతలు.. ఇక్కడి వైసీపీ నాయకులకు సన్మానాలు చేయడం, వారిని పొగడ్తల్లో ముంచెత్తడం, కొన్నిసార్లు వారితో పొగిడించుకోవడం.. వంటి పరిణామాలను జనం ఒక కంట గుర్తిస్తూనే ఉన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సజావుగా ఎన్నికల నిర్వహణ

● ప్రథమ ప్రాధాన్యమన్న ఎస్పీ మలికగర్గ్


బాధ్యతలు స్వీకరిస్తున్న మలిక గర్గ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 12: రాబోయే ఎన్నికలను ఎటువంటి సమస్యలూ రాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేటట్టు చూడడమే తన మొదటి ప్రాధాన్యత అని నూతన ఎస్పీ మలిక గర్గ్ అన్నారు.గతంలో ఇక్కడ జరిగిన ఘటనలు, వాటి పర్యవసానాలను ప్రస్తుతం చూస్తున్నామని, మళ్లీ అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టిన ఆమెకు పోలీసు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిస్తానని చెప్పారు.ఎన్నికల సందర్భంగా చాలా కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు.ఓ టీమ్‌గా ఎలా పనిచేయాలి, ఎలాంటి సమస్యలు ఎదురౌతాయి, వాటిని అధిగమించేందుకు ఏంచేయాలనే ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ఢిల్లీకి చెందిన మలిక గర్గ్ 2015 ఐపీఎస్ బ్యాచ్ అధికారిణి. పశ్చిమబెంగాల్ క్యాడర్‌కు చెందిన మలిక గర్గ్ శిక్షణ తరువాత పశ్చిమ బెంగాల్ చందన్ నగర్‌లో ఏసీపీగా, సీరాంపూర్ ఏసీపీగా, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్‌గా పనిచేశారు. అనంతరం ఇంటర్ ట్రాన్స్‌ఫర్‌లో ఏపీ క్యాడర్‌కు వచ్చారు. తొలుత కృష్ణా జిల్లా ఏఎస్పీగా పనిచేసి, తరువాత ప్రకాశం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2 సంవత్సరాల 7 నెలలపాటు అక్కడ ఎస్పీగా పనిచేసిన ఆమె ఇటీవలి బదిలీల్లో భాగంగా తిరుపతిలో బాధ్యతలు చేపట్టారు.




వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు రాకెట్ తరలింపు

ప్రయోగ వేదికపైకి జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 14

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించి అనుసంధాన పనులు పూర్తయ్యాయి. 2,275 కిలోల బరువు గల కలిగిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు ప్రయోగించేందుకు షార్ శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. జీఎస్‌ఎల్వీ- మార్క్2 సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. పీఎస్‌ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్‌ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం ఇస్రో ఈ ప్రయోగం చేపట్టిన విషయం తెలిసిందే. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో (వ్యాబ్) రాకెట్ మూడు దశల అనుసంధాన పనులతో పాటు రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను పూర్తి చేసి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించారు. ప్రయోగ వేదిక ఉన్న జీఎస్‌ఎల్వీ రాకెట్‌కు లెవల్-1, లెవల్-2 తనిఖీలను చేపడుతున్నారు. తుది పరీక్షల అనంతరం లాంచ్ రిహార్సల్, ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించారు. అన్నీ సజావుగా సాగితే ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి ఎగరనుంది.


సిలిండర్ పేలి రేగిన మంటలు

సీఆర్‌ఎస్‌లో సిలిండర్ పేలుడు

రేణిగుంట, ఫిబ్రవరి12: రేణిగుంట సమీపంలోని రైల్వే క్యారేజ్ రిపేరుషాపు(సీఆర్‌ఎస్)లో శనివారం రాత్రి 8.30గంటలకు ఓ గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. సీఆర్‌ఎస్‌లో సాధారణంగా శనివారం మధ్యాహ్నం నుంచి కార్మికులకు సెలవు.తిరిగి సోమవారం ఉదయం మాత్రమే పనులు ప్రారంభమవుతాయి.అయితే రైలుపెట్టెల మరమ్మతులు ఎక్కువ చేశామని గుర్తింపు తెచ్చుకోవడానికి అధికారులు రాత్రివరకు కాంట్రాక్టు కార్మికుల చేత పనులు చేయించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అదృష్టవశాత్తూ కోచ్ బాడీ రిపేరు (సీబీఆర్ షాపు)లో సిలిండర్ పేలినప్పుడు లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని తెలిసింది. విధుల్లో భాగంగా సోమవారం లోనికి వెళ్లిన కార్మికులు సిలిండర్ పేలిందని గుర్తించి భయభ్రాంతులకు గురయ్యారు.గతంలో సిలిండర్ పేలి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ సంఘటనపై సీఆర్‌ఎస్ చీఫ్ వర్క్‌షాపు మేనేజరు దేవసహాయాన్ని వివరణ కోరగా ప్రమాదం ఎలా జరిగిందన్న విషయమై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.


పేలుడుతో దూరంగాపడివున్న సిలిండర్ భాగాలు

ముక్కంటి సేవలో ఇటలీవాసులు



శ్రీకాళహస్తి ఫిబ్రవరి 12:శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం పలువురు ఇటలీ భక్తులు దర్శించుకున్నారు. విదేశీ భక్తులు భారతీయ సాంప్రదాయ వస్త్రధారణతో ఆలయానికి చేరుకోగా అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించారు.ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ మంత్రముగ్ధులైన ఇటలీవాసులు ఊంజల సేవా మండపం వద్ద ఆశీనులై భక్తి తన్మయత్వంతో శివనామస్మరణ చేశారు. స్థానికులు విదేశీ భక్తులతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు.

సత్యవేడులో ట్రిపుల్ ఐటీకి 46 ఎకరాల భూమి

తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలంలో ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థకు రాష్ట్రప్రభుత్వం 42.23 ఎకరాల భూమి కేటాయించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వం తాజాగా భూ కేటాయింపు జరుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. సత్యవేడు మండలం మల్లావారిపాలెం రెవిన్యూ గ్రామం 382, 389, 392, 393, 394, 395 సర్వే నంబర్లలోని 42.23 ఎకరాలను ఎకరా రూ. 11.75 లక్షలు చొప్పున ధరతో కేటాయించింది. ఈ భూములను 2008లో అప్పటి ప్రభుత్వం పరిశ్రమల కోసం ఏపీఐఐసీకి కేటాయించింది.ఆ భూములను వెనక్కు తీసుకుని ట్రిపుల్ ఐటీ కోసం కేటాయించాలని, అందుకోసం ఎకరాకు రూ. 4.70 లక్షల ధరతో తిరుపతి కలెక్టర్ గత నెల 19న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ధరను రెండున్నర రెట్లు పెంచి భూములను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖకు కేటాయిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రైవేటు వెంచర్ కోసం

చెరువులో బాట!

● శ్రీకాళహస్తిలో రియల్టర్ల ఆగడాలు
● అధికార పార్టీ నాయకుడి అండతో బరితెగింపు


చెరువులో దారి ఏర్పాటుకోసం తెప్పించిన సిమెంట్ పైపులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తి పట్టణ శివారు లోని బసవయ్యపాలెం వద్ద లింక్ బైపాస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న చెరువుపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. చెరువు భూమికి ఆనుకుని వేసిన వెంచర్‌కు దారికోసం ఏకంగా పైపులు వేసి చెరువునే చదును చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఆరు నెలల క్రితం లింక్ బైపాస్ రోడ్డు నుంచి మొదట చిన్న రోడ్డు ఏర్పాటు చేసి తర్వాత సుమారు రూ.20 కోట్ల చెరువు భూమి స్వాహా చేసేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు సాగించారు.ఈ విషయంపై శ్రీకాళహస్తిలో భూరాబందులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో పనులాపేశారు. మళ్లీ డిసెంబర్ 25వ తేదీన బసవయ్యపాలెం చెరువులోకి బాట వేసేందుకు రాత్రికి రాత్రి చదును చేశారు.ఈ విషయాన్నీ ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో మరికొంతకాలం చెరువు కబ్జాకు అడ్డుకట్ట పడింది.ఇటీవల కొయ్యల అమ్మకాలు చేసే కొందరు చెరువు భూమికి ఆనుకుని ల్యాండ్ కన్వర్షన్, అప్రూవల్ తీసుకోకుండానే ప్లాట్లు వేశారు.కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఒకరి భూమి గుండా రోడ్డు చూపుతూ ప్లాట్లు అమ్మేశారు.దీంతో ఆ భూమి యజమాని తన స్థలానికి కంచె వేసుకోవడంతో ప్లాట్లకు దారి లేకుండాపోయింది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అమ్మకందారులను నిలదీయం మొదలు పెట్టారు.ఈ పరిస్థితుల్లో రియల్టర్లు బసవయ్యపాలెం పంచాయతీలోని ఓ కీలక వైసీపీ నేతతో చేతులు కలిపారు. చెరువు భూమిలో పైపులు వేసి బైపాస్ నుంచి ప్లాట్లకు రోడ్డు వేసేందుకు పథకం రచించారు. అధికారుల చేతులు తడపడంతో ఇక అడిగే వారుండరన్న ధీమాతో సిమెంట్ పైపులను దించి రాత్రివేళ చెరువు భూమిలో బాట వేసేందుకు సన్నద్ధమయ్యారు.సోమవారం సాయంత్రం చెరువును పూడ్చేందుకు పొక్లయినరును కూడా తరలించారు. అర్ధరాత్రి సిమెంట్ పైపులపై టిప్పర్లతో మట్టి తోలేందుకు సిద్ధమయ్యారు. బైపాస్ నుంచి ఇదే రోడ్డు ఏర్పాటయితే మొత్తం చెరువుకు చేటు తప్పదు. అందుకే గత పాలకులు చెరువులోకి బాటలు వేయకుండా రక్షించారు.అయితే ఇప్పటి పాలకులు రియల్టర్లతో చేతులు కలిపి చెరువు భూమిని ఆరగించేందుకు సిద్ధమయ్యారు.


చెరువును పూడ్చేందుకు తెప్పించిన పొక్లయినరు.మట్టి తోలేందుకు పరిచిన పైపులు

అమ్మకు విగ్రహం



తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారులు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 12: ఏడాది గడిచినా.. వెళ్లిపోయిన అమ్మ తలపులు ఆ బిడ్డలను వదలడం లేదు. పేదరాలైన ఆ తల్లి పడ్డ కష్టం.. తమను పెంచి పెద్దచేసిన తీరు.. తమ ఉన్నతి కోసం ఆమె తాపత్రయం.. ఇవన్నీ రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన ఆ తల్లి కోసం తల్లడిల్లిన బిడ్డలు ఆమె జ్ఞాపకాలకు పదిలపరచుకోవాలనుకున్నారు. గత యేడాది జనవరి 24న నెల్లూరు జిల్లా కావాలి వద్ద జరిగిన కారు ప్రమాదంలో తమకు దూరమైపోయిన అమ్మను విగ్రహంగా మార్చుకుని తమ ఇంటి ఆవరణలో ప్రతిష్ఠించుకున్నారు. దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామంలో సోమవారాం సంచి రమణమ్మ(61) విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. విజయ్‌కుమార్, శ్యామ్, వినయ్‌కుమార్‌లకు అమ్మమీద ఉన్న ప్రేమానురాగాలను చూసి ఊరు అబ్బురపడింది. ఆతల్లి కష్టంతో పెరిగిన వీరిలో ఒకరు వ్యాపారి కాగా, మరో ఇద్దరు సాఫ్ట్‌వేరు ఇంజనీర్లుగా విదేశాల్లో స్థిరపడ్డారు. సంచి రమణమ్మ తెలుగుదేశం పార్టీ మండల మహిళా నాయకురాలిగా చురుకైన ప్రాత పోషించారు. సోమవారం టీటీడీ బోర్డు సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి రమణమ్మకి నివాళి అర్పించారు.

ఒక్కఛాన్స్‌తో రాష్ట్రం అధోగతి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 12: ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక నమాజుకట్ట ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిత్యవసరాల వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గాడితప్పిన పాలనను సరిచేయాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు చంద్రబాబునాయుడు చేయూతనిస్తారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వాటంబేడు శివకుమార్, మధు, సయ్యద్, పులిమి శ్రీనివాసులు, అమరయ్య, అల్లీహుస్సేన్, మట్టం శ్రావణి, భారతి, కల్పన, నూర్జహాన్, సుధా తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: సూళ్లూరుపేట పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్ అధికారులు సోమవారం దాడులు చేసి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని బొగ్గుల కాలనీ సమీపంలో ఓ మినీలారీలో ప్లాస్టిక్ గోతాల్లో కట్టిన బియ్యం బస్తాలు తరలించేందుకు ఉన్న 5,757 కిలోల బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకొన్నట్లు సీఎస్ డీటీ ఓబయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితులను ముంచింది జగనే: నెలవల



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఫిబ్రవరి 12: సీఎం జగన్ దళితుల సంక్షేమం కోసం ఒక్క పైసా ఖర్చు చేసిన దాఖలాలు లేవని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం మండలంలోని చింతపూడి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరగడంతో దళిత వర్గాలు ఎంతో చితికిపోయాయన్నారు. దళితులను ఆదరించి ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి వైపు నడిపించింది టీడీపీయేనని కొనియాడారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా వేల కోట్లు కేటాయించి ఎంతో మంది దళితులను ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, మీరయ్యనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య, మునీష్, గురవారెడ్డి, పరుశురాం, కేవీనాయుడు, సురేష్‌నాయుడు, ఉదయ్‌నాయు, యుగంధర్, గురవయ్య, సత్యనారయణ, తదితరులు ఉన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి: జనసేన

గూడూరు, ఫిబ్రవరి 12: రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని జనసేన నాయకులు అన్నారు. సోమవారం స్థానిక అడివయ్యకాలనీలో 'జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఇంద్రవర్ధన్, రాజశేఖర్, అవినాష్, సతన్, సునీల్‌కుమార్, శ్రీనివాసులు, చైతన్య పాల్గొన్నారు.

మూడు ఆలయాల్లో చోరీ

బాలాయపల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని చిలమనూరు పరిధిలో ఆదివారం రాత్రి మూడు ఆలయాల్లో చోరీ జరిగింది. చిలమనూరులోని పాండు రంగస్వామిగుడి, ఎస్సీ కాలనీలోని పాండు రంగస్వామి గుడి, మాతమ్మ గుడిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ మహబూబ్ సుభాని ఆలయాల్లో చోరీ జరిగిన తీరును పరిశీలించారు. మాతమ్మ గుడిలో అమ్మవారి తాళిబొట్టుతో కలిపి 18 గ్రాముల బంగారం, ఐదు వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్య

కోట, ఫిబ్రవరి 12: కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని గల రాఘవాపురం గ్రామానికి చెందిన కొకొల్లు భాస్కర్(55) సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబకలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో భాస్కర్ పురుగుల మందుతాగి సమీప పొలాల్లో అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రబరి 12: పట్టణంలో పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం పదేళ్ల బాలికను ఒక వ్యక్తి తీసుకొని వెళ్తుండగా గమనించిన స్థానికులు దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డాక్టర్ రాకపోవడంతో ఖాళీగా దర్శన మిస్తున్న కుర్చీ - ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న రోగులు

అత్తెసరు వైద్యమే

- వేళలు పాటించని వైద్యులు
- పేరుకే కాల్ డాక్టర్లు
- రాత్రి వేళల్లో నర్సుతోనే వైద్యం
- డిప్యుటేషన్‌లో డీసీఎస్

డక్కిలి, ఫిబ్రవరి 12: డక్కిలి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అత్తెసరు వైద్యమే అందుతోంది. 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి వున్నా అవేవీ ఇక్కడ అమలు కావడంలేదు. రాత్రివేళల్లో ఏదైనా సమస్యతో ఆస్పత్రికి నర్సు మాత్రమే అందుబాటులో వుంటున్నారు. మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందివ్వాలన్న ఉద్దేశంతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి అన్ని హంగులతో డక్కిలిలో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మించారు. పదేళ్లపాటు ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేవి. ఆ తర్వాత వైద్యుల కొరతతో దీన్ని పీహెచ్‌సీ స్థాయికి తీసుకొవచ్చారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి వున్నా అవేవీ ఇక్కడ జరగడం లేదు. డిప్యూటీ చీఫ్ సర్జన్(డీసీఎస్)తో పాటు ముగ్గురు డాక్టర్లు పనిచేస్తున్నారు. డీసీఎస్ తిరుపతికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆమె నెలలో కొద్ది రోజులు డక్కిలి ప్రభుత్వాస్పత్రిలో రోగులను చూడాల్సి వుంది. కానీ డీసీఎస్ ఇటువైపు రావడంలేదు. చివరికి ఉద్యోగులు జీతాలు బిల్లుల సంతకాలకు కూడా తిరుపతికి వెళ్లాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ఇక ఇద్దరు జనరల్ డాక్టర్లతో పాటు ఒక డెంటిస్ట్ వున్నా వారు సమయ పాలన పాటించడంలేదని రోగులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి ఔట్ పేషంట్ రోగులకు సేవలు అందించాలి. అయితే సోమవారం ఉదయం 11 వరకు ఆస్పత్రికి డాక్టర్లు ఎవరూ రాకపోవడంతో రోగులు ఎదురు చూడాల్సి వచ్చింది. సిబ్బందిని అడిగితే మహిళా వైద్యురాలు 104 సేవల్లో భాగంగా ఫీల్డ్ మీద వెళ్లారని చెప్పారు. డెంటిస్ట్ వారంలో మూడురోజులు గూడూరు మండలంలోని చెన్నూరు ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సి ఉన్నందున అక్కడికి వెళ్లారని తెలిపారు. 11 గంటల తరువాత ఒక డాక్టరు వచ్చి రోగులను చూశారు.

అందుబాటులో లేని కాల్ డాక్టర్స్

ఆస్పత్రిలో 24గంటలు వైద్య సేవలు అందించాలన్న నిబంధన ఏమాత్రం అమలు కావడం లేదు. రాత్రి వేళల్లో కేవలం ఒక నర్సు మాత్రమే అందుబాటులో వుంటున్నారు. స్థానికంగా నివాసం ఉండాల్సిన వైద్యులు వెంకటగిరి, తిరుపతిలో ఉంటున్నారు. రాత్రి వేళ ఏదైనా ప్రమాదం జరిగి ఆస్పత్రికి వస్తే వైద్యులు అందుబాటులో లేకపోతుండడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో 24గంటలు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలి: ఆనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి

బాలాయపల్లి, ఫిబ్రవరి 12: వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం భవనంలో బాలాయపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో సాగునీరు లేక పంటను వదిలేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమశిల జలాశయం నుంచి ఐదు టీఎంసీల నీటిని కండలేరు జలాశయానికి కావాలని ఇటీవల నెల్లూరులో జరిగిన ఐఏబీ సమావేశంలో అధికారులు కోరక పోవడం వల్లే నీటి సమస్య ఎదురైందన్నారు. ఇప్పుడైనా ఇచ్చే ఒక్క టీఎంసీ నీటిని బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి గ్రామాల పరిధిలో ఉన్న 2ఏ ,4ఏ, 5ఏ బ్రాంచ్ కెనాల్‌కు విడుదల చేయాలన్నారు. ఈ బ్రాంచ్ కెనాల్‌కు సాగు నీరు రాకపోతే పంటలు ఎండిపోతాయన్నారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగానే జయంపులో పీహెచ్‌సీ నిర్మాణంలో జాప్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వ భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు ఇవ్వడంలేదని, దీంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వెంకటగిరి - చెన్నూరు రోడ్డు విస్తరణ పనులు తాను ఆపేసినట్లు కొందరు ఆరోపణలు చేస్తున్నారని, ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిపివేయడం జరిగిందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బట్టేపాటి మురళి, ఎంపీడీవో అరుణ, డిప్యూటీ తహసీల్దార్ శిరీష, ఏవో వినీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏదో ఒక పార్టీ నుంచి పోటీ చేస్తా

వచ్చే ఎన్నికల్లో ఏదో ఒక పార్టీ నుంచి వెంకటగిరిలో పోటీ చేస్తానని ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనని ఆశీర్వదిస్తే సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అందరితో కలిసి పని చేస్తానని చెప్పారు. కొందరు విజ్ఞత మరచి తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, నియోజకవర్గంలో ఏ మండలానికి ఏం చేశానో అన్నీ వివరిస్తానని ఆనం అన్నారు.

విదేశీ మద్యం స్వాధీనం

తడ, ఫిబ్రవరి 12: అక్రమంగా తరలిస్తున్న విదేశీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భీములవారిపాళెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఒంగోలు వైపు వెళ్తున్న ఓ కారును తనిఖీ చేయగా సుమారు 15 బాటిళ్ల విదేశీ మద్యం లభ్యమైంది. కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో ఒకరు డ్రైవరు కాగా, మిగిలిన ముగ్గురు నెల్లూరు జిల్లా కావలికి చెందిన మన్నెపల్లి ప్రసాద్, ఒంగోలుకు చెందిన దాసరి రవికిషోర్, పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం అప్పణపేటకు చెందిన లచ్చిరెడ్డి వెంకటరావు గా తెలిసింది. వీరు థాయిలాండ్ నుంచి చెన్నై ఎయిర్ పోర్టుకు వచ్చారు. అక్కడి నుంచి కారులో స్వగ్రామానికి మద్యం తీసుకెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. మద్యం, కారును స్వాధీనం చేసుకొన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశారు.

అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసాద్ నాయుడు

వెంకటగిరి, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు అన్నారు. వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 2100 మంది యువకులు ఉద్యోగ అవకాశాలు లేక ఆత్మహత్యలు చేసుకొన్నారన్నారని తెలిపారు. రాష్ట్రంలో 24శాతం యువత ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎక్కువ శాతం మంది యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 2600మంది మహిళలపైన అత్యాచారాలు జరిగాయన్నారు. గడిచిన నాలుగన్నర ఏళ్లలో విద్యారంగం పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందన్నారు. యువత ఇప్పటికైనా మేలుకోకపోతే భావితరాల భవిషత్ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని, లేకుంటే వెంటనే నమోదు చేసుకొని వచ్చే ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులికోట్ల రాజేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శులు చావా హేమంత్, సుకుమార్, అధ్యక్షుడు శివతేజ, నాని తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరికి ఏమి చేశారో ఆనం చెప్పాలి: రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 12: గత నాలుగు సంవత్సరాల్లో వెంకటగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఏమి చేశారో చెప్పాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆనం కుటుంబానికి రాజకీయ భవిష్యత్తు ఇచ్చింది నేదురుమల్లి జనార్దన రెడ్డేనని అన్నారు. వెంకటగిరి రైతుల సాగునీటి కోసం గంగ జలాలు కావాలని అధికారులకు చెప్పని ఆనం, ఎమ్మెల్యే హోదాలో ప్రోటోకాల్ ఉందని చెప్పుకుని సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పోలీసులపై దాడి ఘటనలో అనుమానితుల విచారణ

వాకాడు, ఫిబ్రవరి 12: కోడి పందేలను ఆపమన్నందుకు పోలీసులపైనే దాడి చేసిన సంఘటనలో పలువురు అనుమానితులను సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో వాకాడు, కోట, చిట్టమూరు ఎస్‌ఐలు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పవన్ కుమార్ చెప్పారు.

చెంగాళమ్మ సేవలో డీఆర్‌డీవో మాజీ చైర్మన్



సతీష్ రెడ్డికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈవో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని సోమవారం డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీష్ రెడ్డి దర్శించుకొన్నారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రా రెడ్డి, ఈవో వెంకటేశ్వర్లు ఆలయ మర్యాదలతో సతీష్ రెడ్డికి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వవచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరూరులో భవిష్యత్‌కు గ్యారెంటీ

చిట్టమూరు, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరూరు గిరినాయుడు, దేవుడు, ముత్తు, శివారెడ్డి, జనార్దనరెడ్డి, నల్లారెడ్డి రాజేష్ రెడ్డి, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య ఆచారి,పవన్, కల్లూరు మణి, వెంకటరమణయ్య, మురళీధర్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విజయానికి కృషి చేయండి

గూడూరు, ఫిబ్రవరి 12: రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని అయ్యవారిపాళెం, మేగనూరు, కాంద్ర, వెందోడు గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చిల్లకూరులో పోలింగ్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

పెళ్లకూరు, ఫిబ్రవరి 12: మండలంలోని జీలపాటూరు, చిల్లకూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తగిన సదుపాయాలు సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్‌రావు, ఆర్‌ఐ సంతోషి బాయి, వీఆర్వో రమేష్, వీఆర్ఏలు కృష్ణ, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులకు నోటీసులు

కోట, ఫిబ్రవరి 12: కోట పట్టణంలోని 24 మంది దుకాణదారులకు సోమవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు నోటీసులు అందజేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఈ నెల 15వ తేదీలోగా దుకాణాలను ఖాళీ చేయాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

లారీ బోల్తా

దొరవారిసత్రం, ఫిబ్రవరి 12: దొరవారిసత్రంలో సోమవారం తెల్లవారుజామున లారీ బోల్తా పడింది. నాయుడుపేట నుంచి కట్టెల లోడుతో చెన్నై వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: స్థానిక సామాజిక ఆరోగ్యం కేంద్రంలో రూ.5 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీహెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్లు చిన్న సత్యనారాయణ, పద్మ, అయితా శ్రీధర్, దొరై రెడ్డి, వైద్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో 2 జిల్లా కమిటీ ఎన్నిక



మించిల శంకరయ్య, సతీష్ బాబు, గున్నయ్య

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: ఎంఈవో 2 జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారుల సమావేశం జరిగింది. ఇటీవల ప్రభుత్వం ప్రతి మండలానికి ఎంఈవో-2ను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎంఈవోలు కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా మించెల శంకరయ్య, గౌరవ అధ్యక్షుడిగా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా సతీష్ బాబు, కోశాధికారిగా గున్నయ్య తదితర సభ్యులను ఎన్నుకున్నారు.

చిరంజీవికి శుభాకాంక్షలు

గూడూరు, ఫిబ్రవరి 12: సినీనటుడు చిరంజీవికి ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవికి పద్మవిభూషణ్ ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం హైదరాబాదులో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 12: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని రాష్ట్ర రైతు సాధికారిక సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) సీఈవో రామరావు కోరారు. ఆయన సోమవారం దొరవారిసత్రం మండలం తల్లంపాడు, వీఎంఆర్ నగర్ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిల్లో సాగుచేస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడే విధానం, రైతుల అనుభవాలను అడిగి తెలుసుకొన్నారు. రైతులు కూరగాయాలు, ఆకు కూరలే కాకుండా, వాణిజ్య పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీపీఎం షణ్ముగం, డీఎల్‌పీఎం పట్టాభిరెడ్డి, రవిచంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, కల్పన, కొండయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 12: వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా అధికారులను ఆదేశించారు. పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జీలపాటూరు పంచాయతీ సర్పంచు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో స్వర్ణముఖినదిలో ఏర్పాటుచేసిన తాగునీటి బోర్లు, పైపులైన్ వరదలకు కొట్టుకుని పోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, ఈ సమస్య పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ప్రత్యేక అధికారి డాక్టర్ వేణుగోపాల్, ఎంఈవో మించల శంకరయ్య, వైస్ ఎంపీపీ సుధారాణి, ఏవో ప్రవీణ, ఎంపీటీసీలు, శ్యామలమ్మ, జాన్సీ, కుమార్‌స్వామి, కృష్ణయ్య, సర్పంచులు సంచి కృష్ణయ్య, మాతయ్య, మునీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత రామ్మోహనరావు మృతి



ఓజిలి, ఫిబ్రవరి 12: టీడీపీ సీనియర్ నేత కంకణాల రామ్మోహనరావు (81) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పది రోజులుగా విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కంకణాల సత్యవరప్రసాద్‌రావు టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కుమార్తె అమెరికాలో ఉంటున్నారు. రామ్మోహనరావు మృతి పట్ల సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసా రత్నంతో పాటు ఓజిలి మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, సీనియర్ నాయకుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్యతో పాటు పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

గూడూరు, ఫిబ్రవరి 12: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిమల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక సనత్‌నగర్, నరసయ్యగుంట ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు.

మద్యం సీసాల స్వాధీనం

చిల్లకూరు, ఫిబ్రవరి 12: మండలంలో తూర్పుకనుపూరు గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 15మద్యం సీసాలను సోమవారం ఎస్‌ఐ అంజిరెడ్డి స్వాధీనం చేసుకున్నారు. కదిరి గ్రామానికి చెందిన ధర్మయ్య తూర్పుకనుపూరులో నివాసముంటున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో అదుపులోకి తీసుకుని 15సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భోజనం నాణ్యత పెంచాలి

కోట, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని వంజివాక మెయిన్ పాఠశాలను సోమవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి నాణ్యత పెంచాలని హెచ్ఎం పద్మమ్మకు సూచించారు.

కూలిన కళాశాల ఆర్చి

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 12: పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల ముఖద్వారం ఆర్చి సోమవారం కూలిపోయింది. పక్కన ఉన్న భవనాన్ని కూల్చివేస్తున్న పొక్లయిన్ తగలడంతో ఆర్చి కూలిపోయింది.